


సంపుట : ౯. వృష, వైశాఖము : మే, 1941. సంచిక : ౭.

వైశాఖమాసపు మూడు పర్వాలు


౧
పరశురామజయంతి

దశావతారాల్లో పరశురామావతారం ఆరోది. వైశాఖ శుక్లపక్షతృతీయ నాటిరాత్రి మొదటి జామున పునర్వసు నక్షత్రంలో పరశురామావతారము ప్రారంభమైందని స్కాంధపురాణము, నిర్ణయసింధువులు చెప్పుచున్నవి.

శ్రీకృష్ణుని, శ్రీరాముని జయంతులు ఏమాదిరిగా జరుపుతున్నామో అట్లే పరశురామజయంతికూడా జరపవలసిందిగా మన శాస్త్రాలు ఆజ్ఞాపిస్తున్నాయి. కాని ఈజయంతి అంత విశేషప్రచారంలో లేదు. ఉత్తరహిందూస్థానంలో మథుర, వారణాసి నగరాలలో మాత్రం ఈజయంతి విశేషంగా చేస్తారు.

అస్సాముదేశంలో కామాక్షి దేవిగుడి వుంది. అదే జమదగ్ని ఆశ్రమం అని చెబుతారు. ఆ ప్రాంతంలో పరశురామాలయంకూడా వుందని తెలుస్తూవుంది.

దక్షిణభారతదేశంలో మలబారు భూమి పరశురామ నిర్మితం అని అంటారు. సముద్రంలో బాణంవేసి ఆభూమిని పరశురాముడు పైకితెచ్చాడు అంటారు. మలబారు వారిది పరశురామశకము. పరశురాముడు వున్నచోట కరువువుండదట. కాబట్టే మలబారులో ఎప్పుడూ కరువు వుండదు. రత్నగిరిలో పరశురామమందిరం వుంది. అక్కడ గొప్ప ఉత్సవం జరుగుతుంది.



౨
అక్షతృతీయ

వైశాఖ శుక్ల తృతీయ అక్షతృతీయ అనీ, ఈపర్వము పూర్వాహ్ణవ్యాపిని అనీ వ్రతరాజము చెబుతూవుంది.

మన్వాధి తిథి, యుగాదితిథి ఇదే అని శాస్త్రవచనం.

ఈనాడు లక్ష్మీసహితమైన నారాయణ్ణి పూజించాలి. ఆపూజలో విసనకర్రలు, లడ్లు పంచిపెట్టినవారు వైకుంఠాన్ని పొందుతారు. ఈరోజున గంగాస్నానము చేయువారు సకలపాప విముక్తులగుదురు.

అక్షతృతీయనుగురించి భవిష్య పురాణంలో శ్రీకృష్ణుడు యుధిష్ఠురునకు ఇట్లు చెప్పెను: పూర్వకాలంలో, దరిద్రుడు, ప్రియవాది, సత్యవ్రతుడు, దేవబ్రాహ్మణభక్తుడు అగు ఒక కోమటివుండెను. అతను ఒకసారి వైశాఖమాసపు శుక్లపక్ష మహాత్మ్యము విని పోయి గంగాస్నానము చేసి ఇంటికివచ్చి పూజచేసి లడ్లు, విసనకర్రలు దానముచేశాడు. ఆకోమటి ఉత్తరజన్మలో కుశవతినగరంలో ధన

వంతుడైన ఒక క్షత్రియునియింట పుట్టాడు. ఆజన్మలో కూడా అతడు దానవిరతిని వీడలేదు. ఇది అంతా అక్ష తృతీయ వ్రతాచరణప్రభావము.

ఇక వ్రతవిధి. తృతీయనాడు స్నానం చేసి పితృతర్పణాలు విడిచి భగవంతుడైన శ్రీవాసుదేవుని పూజించాలి. ఒంటిపూటే భోజనంచేయాలి. యవలతో అన్నంవండి దేవుడికి ఆరగింపు పెట్టాలి. బ్రాహ్మలికి నవధాన్యాలు దానం చేయాలి. ఆదానాలు గ్రీష్మఋతువులో లభ్యమయ్యే ఇతర వస్తువులతో కలిపి దానంచేయాలి. దీనివల్ల శివలోకప్రాప్తి అగును. ఈనాటిదానాలలో జలపూరిత కుంభం ముఖ్యమైనది.

ఈవ్రతం కేవల ధార్మికగణ సంపన్నమైనది అందువల్ల ఈపండుగ ఆట్టే ఆర్భాటంతో జరిగేదికాదు. ఈ పర్వం హిందూదేశం అంతటా వున్నది. దేవాలయాల్లో ఈనాడు విగ్రహాలకు ధవళ వస్త్రాలు కడతారు.

3

నృసింహజచతుర్దశి

నృసింహ చతుర్దశి వ్రతాన్ని హేమాద్రి, నృసింహపురాణ, స్కాంధ పురాణాలు వివరిస్తూవున్నాయి.

వైశాఖశుక్ల చతుర్దశినాడు ఈ వ్రతంచేయాలి. 'వైశాఖశుక్ల చతుర్దశి నాటి రాత్రి నేను పుట్టితిని. కాబట్టి ఆ నాడే వ్రతంచేయుటకు తగినరోజు.' అని నృసింహస్వామి వచించినట్లు కలదు.

'వైశాఖశుక్ల చతుర్దశి సోమవారం స్వాతీనక్షత్రియుక్త ప్రదోషకాలంలో నృసింహస్వామి అవతరించాడు. స్వాతి నక్షత్రంశనివారం సిద్ధయోగంలో ఈవ్రతం చేయడం పరమ శ్రేష్టము. కాని ఈ విధమైనయోగం కలిసిరావడం చాలా కష్టము. 'ఆయోగం కుదరిననాడైనా, లేక నాపుట్టిననాడైనా ఈవ్రతం చేయ తగింది. నావ్రతం చేయడానికి అన్ని వర్ణాలవారికి అధికారముంది.' అని నృసింహస్వామి స్కాంధపురాణంలో వచించినట్లు కలదు.

త్రిపుర సంహారానికి పూర్వం ఈశ్వరుడు, బ్రహ్మ సృష్టికి పూర్వం ఈవ్రతాన్ని చేశారు.

వ్రతవిధి. వైశాఖశుక్ల చతుర్దశినాడు ఈవ్రతం చేయాలి. ఆరోజున ఎవరు ఎట్టి పాపాలు చేయకూడదు. మధ్యాహ్నం స్నానం చేయాలి. గోమయశుద్ధమైన యింట అష్టదళపద్మంపెట్టి కలశస్థాపన చేయాలి. ఆకలశంమీద బియ్యంతో నిండిన వెదురుగొట్టం వుంచాలి. అక్కడ లక్ష్మీనారాయణుల విగ్రహాలు వుంచాలి. శాస్త్రోచర ప్రకారం వ్రతం జరపాలి. రాత్రి జాగరణచేసి పురాణకాలక్షేపం చేయాలి. మరునాటి ఉదయాన్ని తిరిగి పూజచేయాలి. తరువాత యథాశక్తి దానాలు; భోజనాలు.

మూల్టాన్‌లో నృసింహజయంతిగొప్పగా సాగిస్తారు. ప్రహ్లాదునితండ్రి హిరణ్యకశిపుడు అవూరివాడట. ఆసందర్భమైన చిహ్నాలు ఇప్పటికి కూడా అక్కడ వున్నాయి.

దక్షిణదేశంలో నృసింహజయంతి పర్వ సందర్భంలో దీపోత్సవాలు జరుగుతాయి. ఊరేగింపులు చూడతగ్గవి. హంపిలోని నృసింహదేవాలయం చాలా గొప్పది. జయపుర సంస్థానంలో ఖండేలా అనేచోట పన్నెండుచేతులుగల అపూర్వ నృసింహ విగ్రహం కలదు.

మథుర, అయోధ్య నగరాల్లో నృసింహలీల అనే ఉత్సవం జరుగుతుంది. మాళవదేశంలో ఊరేగింపు.

పదాలు · ఇటుకలు

జార్జి మెరిడిత్ అని ఒక ఆంగ్ల గ్రంథకర్త. అతడు తన కాపురపు కాణాచి ఐన బర్‌ఫర్డు బ్రిడ్జిలో ఇల్లు కట్టుకుంటూ వున్నాడు అది సగం తయారైంది.

దానిని చూడ్డానికి మిత్రురాలు ఒకతె వచ్చింది. ఆమెకు అఇల్లు ఏమీనచ్చలేదు.

'నీ పుస్తకాల్లో పెద్దపెద్ద భవనాలు వర్ణిస్తావు కాని నీవు కట్టుకోవడం వచ్చేసరికి ఇట్లా చిన్నఇల్లు కట్టుతున్నావు. ఏమిటి కారణం?' అన్నదామె.

దానికి జవాబుగా అతడు 'అమ్మా! పదాలు ఇటుకలకంటె చవక' అన్నాడు.

కారాగారంలో ఉండగా

సర్ వాల్టర్ రాలే ప్రపంచ చరిత్ర వ్రాశాడు.

ఛార్లస్ గుడ్‌యియర్ రబ్బరు పరిశోధన సాగించాడు.

జాన్ బనియన్ పిల్‌గ్రిమ్స్ ప్రోగ్రెస్ వ్రాశాడు.

లవ్‌లేస్ మంచి పద్యాలు వ్రాశాడు.

డాన్‌టి ఉత్కృష్ట గ్రంథాలు వ్రాశాడు.

తిలక్ గీతారహస్యం రచియించాడు,

డాక్టర్ బ్రహ్మజోశ్యుల సుబ్రహ్మణ్యము

1891-వ సంవత్సరం అక్టోబరు 12-వ తేదీని పుట్టి 1936 డిశంబరు 23-వ తేదీని యీ జీవిత నాటకరంగాన్నుండి వెళ్ళిపోయింది ఒక పాత్ర. ఆంధ్రదేశ ప్రజలు, ముఖ్యంగా సీతానగర ప్రాంతీయులు ఆక్రందనాలు చేశారు. తన ఆశ్రమాన్ని, కుటుంబాన్ని దేశీయులే కాపాడాలని ఆఖరు కోరిక కోరి అసువులు విడచిపెట్టేరు. డాక్టరు బ్రహ్మజోశ్యుల సుబ్రహ్మణ్యంగారు 45 సంవత్సరాల 2 మాసాల 11 రోజులు జీవించారు.

బాల్యము

పుట్టినది గుంటూరు మండలము. పెరిగినది కృష్ణా మండలము. ప్రజాజీవితంలో పాల్గొని తుదకు బలియైనది గోదావరీ మండలము. బాల్యంలో విశేష పేదరికం అనుభవించారు. స్కూలు ఫైనలు ప్యాసయి అన్నగారైన శ్రీ బ్రహ్మజోశ్యుల సీతారామయ్యగారి సహాయంవల్ల కలకత్తా శ్రీ మల్లిక్ గారి నేషనల్ మెడికల్ కాలేజీలో వైద్యవిద్య నభ్యసించారు.

జాతీయభావబీజాలు

18 ఏండ్ల యౌవనంలో శ్రీ సుబ్రహ్మణ్యంగారికి (1910 లో) జాతీయోద్యమానికి ప్రధానకేంద్రమైన కలకత్తా నగరంలో, దేశాభిమానానికి పెట్టినది పేరైన ఆచార్య ఘోషుగారి శుశ్రూష లభించింది. వారివద్దనే విద్యనభ్యసించి కొంతకాలం తరిఫీయదు పొందారు. ఇచ్చటనే జాతీయభావబీజాలు వారి హృదయక్షేత్రమున గాఢముగా నాటుకొన్నవి.

వైద్యవృత్తి

హోంరూల్ ఆందోళన పురోజులైన 1916-వ సంవత్సరం మే నెలలో జాతీయోద్యమానికి కర్మస్థానమైన రాజమండ్రి నగరంలో వైద్యవృత్తికై దిగారు. పాతికేళ్ళ యువకులు. వృత్తినైపుణ్యము, మాటకారితనము, చొరవ, స్నేహపాత్రత, దేశాభిమానము, ప్రజాసేవ. ఇంకేం కావాలి. పేరు ప్రతిష్టలు సంపాదించారు. పూళ్ళో ప్రాక్టీస్ అంతా సుబ్రహ్మణ్యంగారి గుత్తయైపోయినది. నెలకు అవలీలగా అయిదువందలు దాటేటి సంపాదన. పిల్లలు లేరు. భార్యా, తల్లీ, తనూ. కాని బీదవిద్యార్థులు మాత్రం చాలామంది ఆధారపడి వుండేవాళ్లు.

సహాయనిరాకరణం

1920-వ సంవత్సరము సెప్టెంబరులో కలకత్తా స్పెషల్ కాంగ్రెస్‌లో సహాయనిరాకరణ తీర్మానం అంగీకరింపబడగానే యీయన రంగంలోకి మనసారదిగారు. శాసనసభా బహిష్కార సందర్భములో యీయనచేసిన వోట్లనిరాకరణ ప్రచారం అద్భుతం. మహావక్త. పంజాబు హత్యలనుగురించి చెబ్తూవుంటే సభికులకు కన్నీటిధారలు ప్రవహించేవి. చెరుకువాడవారి ఉపన్యాసంలోని నవరసాలు, ఆంధ్రరత్న ఉపన్యాసంలోని భక్తి, హాస్యం; పట్టాభి అనర్గళధోరణి, అంకెలజ్ఞానం లేకపోయినా సుబ్రహ్మణ్యంగారి ఉపన్యాసం గంభీరమై, ఉత్సాహపూరితమై, ఉత్తేజకరమై, హృదయాన్ని కదుకత్తించేలాగ- వేడిరక్తాన్ని పొంగించేలాగ వుండేది. యువకులు వీరావేశంతో చిందులు త్రొక్కేవారు. భావోద్రేకంతో మైమరచేవారు. 1921-వ సంవత్సరంలో కళాశాలల బహిష్కరణ కొంతవరకైనా జరిగిందంటే ఆంధ్రరత్నమూ, మా డాక్టరూ కారణం అని చెప్పాలి.

వృత్తి విసర్జన

నెల కనాయాసంగా ఐదువందలు తెచ్చేవృత్తిని 1921-వ సంవత్సరము మే నెలలో వదిలివేశారు. ప్రజాసేవలో మరొక అడుగు ముందుకు వేశారు. ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ సంఘానికి కార్యదర్శియైనారు. ఆంధ్రదేశ సంచారంలో తన అనుపమాన వాగ్ధాటితో ఆంధ్రలో కొన్ని మేల్కొలిపారు. ఆయన సింహగర్జనలతోనే నీరుకొండ వెంకటరత్నం, మార్ని సుబ్బారావువంటి రైతుప్రముఖులు రంగస్థలంలోకి దిగారు. సీతానగర పరిసర గ్రామాల్లో చిచ్చుముట్టించారు. సీతానగరనిర్బంధితులను 'అగ్గిదార'కు పట్టి యివ్వడానికి హామీగా నిల్చి, బ్రహ్మాండమైన పూరేగింపుతో కాలినడకను రాజమండ్రిచేరి పాల్ చౌక్‌లో సభజరిపి 108 సెక్షన్ క్రింద సంవత్సరం కఠిన శిక్ష అనుభవింప ప్రభుత్వంచే అరెస్టయినారు. ఆనాటి ప్రజాసమూహం- ఆదృశ్యం- మరువలేము. ఎప్పటికీ మరుపుకురాదు.

ఆశ్రమస్థాపన :

1922-వ సంవత్సరం డిశంబరులో విడుదలై గాంధివాక్యాన్ని ఆచరణలో పెట్టడానికి 'మరలండి గ్రామాలకు'

అంటూ అరిచారు. రాజమండ్రిలో 'కాంగ్రెస్' పత్రిక శ్రీమద్దూరి అన్నపూర్ణయ్య సంపాదకత్వంక్రింద నడపబడుతోంది. ఆయన చెరసాలకు వెళితే ద్వితీయ సంపాదకుడు శ్రీ క్రొవ్విడి లింగరాజు గారు. ఆయన అరెస్టుఅయితే డాక్టరు సుబ్రహ్మణ్యంగారు తృతీయ సంపాదకులుగా ఆపత్రికను నడిపారు. తిరిగి శ్రీ అన్నపూర్ణయ్యగారికి పత్రికను ఛార్జీ ఇచ్చివేసి 1924-వ సంవత్సరం 1 డిశంబరుని సీతానగరంలో 10 ఎకరాల విశాలభూమియందు 'గౌతమీసత్యాగ్రహాశ్రమము శంఖుస్థాపన జరిపారు. 1925 ఫిబ్రవరిలో గృహప్రవేశం. ధర్మవైద్యశాల, 'కాంగ్రెస్' పత్రిక, ముద్రణాలయం, దేశబంధు పుస్తకభాండాగారం, ఖద్దరుశాఖ, హిందీప్రచారం, హరిజనసేవ, కాంగ్రెస్ప్రచారం. ఇవి ఆశ్రమవాసులు చేయు ప్రజాహితకార్యాలు.

గాంధిప్రశంస :

1929 మేనెలలో మహాత్ముడు ఆశ్రమంలో 2 రోజులు మకాంవేశాడు. సబర్మతీ చేరగానే తన 'యంగ్ ఇండియా' పత్రికలో 'ఒకగొప్పసంస్థ' అనే శీర్షక క్రింద ఆశ్రమాన్ని గురించి వ్రాశాడు.

1930 లో జైలుప్రవేశం.

ఉప్పుసత్యాగ్రహ సమరంలో జిల్లా అంతటా, దేశమంతటా డాక్టర్ గారి పేరు మార్మోగింది. డాక్టర్ సాంబమూర్తి ప్రభృతులతో చెరసాలకువెళ్ళేరు.

లాఠిచార్జి :

1932 సంవత్సరం జనవరి 4 తేదిని తిరిగి సత్యాగ్రహం. కాకినాడలో లాఠీచార్జి. సాంబమూర్తి ప్రభృతులు జైలుకు పంపబడ్డారు. మండలనాయకత్వం మా డాక్టర్ మీద పడింది.ఆశ్రమదళాధిపత్యం మద్దూరి అన్నపూర్ణయ్యగారిమీదపడింది. డాక్టర్ అమలాపురం వెళ్ళినప్పుడు ఆశ్రమాన్ని పోలీసుదళం ముట్టడించింది. లారీచార్జి, అరెస్టులు, జప్తులు, నూరుమంది సాయుధ పోలీసులతో ముష్కరలాఠీప్రయోగమునకు మూర్తీభవించిన దేవత ముస్తఫాలీనాయకత్వంతో అంతా జైళ్లు చేరారు. జనవరి 26-వ తేదీని స్వాతంత్ర్యోత్సవదినం. మరుపురాని రోజు. కోర్టుకువచ్చారు డాక్టరుగారు. కాని బంధితులనుచూసే అవకాశంలేక వెళ్ళేరు. ఆనాడే శ్రీ మద్దూరి అన్నపూర్ణయ్యగారి సతీమణి, మరి ఇద్దరు ఆజ్ఞోల్లంఘనం చేసి అరెస్టయినారు. కోర్టుహాల్లోవున్న ముస్తఫాలీ మూడుగంతులేశాడు. రక్తవర్ణమైంది మొహం. రోషకషాయితనేత్రుడైపోయాడు. డాక్టరు సుబ్రహ్మణ్యం, నాళం భీమరాజుగార్ల రాక విని పరవళ్లు త్రొక్కాడు. వెంటనే బయలుదేరాడు.

ముస్తఫాలీ రణకేళి :

అరగంటలో రాజమండ్రి బజారులో రక్తం కాల్వలు గట్టింది. డాక్టరు సుబ్రహ్మణ్యం, నాళం భీమరాజుగార్లను చితకగొట్టేశారు. డాక్టరుకు ఎడమవైపున ఎముక విరిగింది. భీమరాజుకు వీపు అట్టు అయిపోయింది. స్వాతంత్ర్యోత్సవదినం ఇంత రమ్యంగా, రక్తప్రవాహంలో రయ్యిమని నడిచింది రాజమండ్రిలోనే. పౌరులు భీతావహులై తలుపులు బిడాయించుకొని హాహారవాలుచేశారు. పంజాబ్ హత్యలను మించిపోయిందని గొల్లుమన్నారంతాను. 3 నెలలు ఆస్పత్రిలో మూల్గిన తర్వాత అబద్ధపుకేసు బనాయించారు. కాని జాయింటు మేజిస్ట్రేటు బాలకృష్ణ అయ్యరు. అఖండప్రజ్ఞతో కేసువిచారించి అబద్ధాలపుట్ట అని తీర్పుచెప్పి, డాక్టరునీ- భీమరాజునీ విడుదలచేశారు.

హరిజనాశ్రమం :

అయినా అమలాపురంలో మరోకేసు బనాయించి ఆరునెల్లు జైల్లో త్రోశారు. బయటికి వచ్చేటప్పటికంతా అగమ్యగోచరంగావుంది. ఆశ్రమం పోలీసుచేతుల్లోవుంది. ప్రజలు అధికారవర్గానికి జడిసి మునపటిలాగ సాయంచేయుటము లేదు. మహాత్మునిమతం త్రొక్కి హరిజనాశ్రమం స్థాపించారు డాక్టరుగారు.

చివరరోజులు :

దేశంలో ఆర్థికసంక్షోభంవల్ల ఆశ్రమం దారిద్ర్యాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. దానితోపాటు డాక్టర్కు క్షయరోగం అంకురించింది. ఆరుమాసాలు బళ్ళారిలోవున్న తర్వాత కొంత నయమైంది. భార్యకు వచ్చినా శీఘ్రంలోనే నయమైనది.

ముస్తఫాలీపై మానవష్టపు కేసులో 750 రూపాయిలు గెలిచారు. 1936 ఫిబ్రవరిలో ఆంధ్రరాష్ట్ర మహాజన సభాహ్వాన సంఘాధ్యక్షపీఠాన్నుండి మళ్ళీ ఒక్కసారి సింహగర్జనచేశారు.

అవసానము :

తిరిగి ప్రవేశించింది క్షయ పిశాచం. జూన్లో మదనపల్లి శానిటోరియంకు పంపినా- గుంటూరులో డాక్టరు ఆమంచర్ల శేషాచలపతిరావుగారు అమూల్యసేవచేసినా లాభం లేకపోయింది. డిశంబరు 23-వ తేదీని రాజమండ్రి శానిటోరియంలో ఆయన అమరత్వం పొందారు.

(శ్రమజీవి)

ఉంటారంటారా?

[చిన్న కథ]

ఈ కథలోని డాక్టరుపాత్ర చిత్రతరంగావుంది. ధనవంతులవద్ద పెద్దఫీజులుగుంజి పేదవాళ్ళకు ఉచిత, ఉపకారపూర్వక వైద్యంచేయడం అతని తీరు. సాధారణ వైద్యులు డబ్బుఇచ్చేవారికి బాగా వైద్యంచేసి పేదల్ని ఈసడిస్తారు. ఈ కథలోని డాక్టరు అట్టివాడు కాడు. అతడు అసాధారణుడు. ఐనా అతడు జమీందారుని రొక్కించి డబ్బు అడగడం పేదరాలు చూచింది. తన బిడ్డ చికిత్సవిషయంలోకూడా డాక్టరు అట్లా నిక్కచ్చి చేస్తాడేమో అని ఆమె అనుమానం. కాగా తనకున్న ఆస్తిలో విలవైన చేతిగాజులు తీసి ఆమె అతనికి ఈయబోయింది. కాని అతడు తీసుకుంటాడా? జమీందారుఇంటికి జమీందారుకారులో వెళ్లాడు డాక్టరు. పేదరాలి ఇంటికి ఆమెను తీసుకుని తన కారులో వెళ్ళాడు. జమీందారు బిడ్డకేసువిషయంలో రెండునిమిషాలుమాత్రమే వెచ్చించిన డాక్టరు పేదరాలి బిడ్డకోసం గంటలకొద్దీ శ్రమించాడు. డాక్టర్లవద్ద ఇట్టి ఉదారత అపరూపం కదా! ఇట్లు ఈకథలోని ప్రధానపాత్ర ఉపాదేయమైనదై వుంది.

—సంపాదకుడు.

రచయిత:

గుంటూరు సత్యనారాయణ, యెం.యే.

'బాబూ! బాబూ!'

'.........'

'డాక్టరు బాబూ!'

'ఎవర్రా అది?'

'బాబు, వెంకట్రావు పంతులుగారి నౌఖరునండి!'

'ఏం, అర్ధరాత్రివే లొచ్చేవు.'

'అమ్మాయిగారికి జెరం ఎచ్చిపోయింది, తేవర్ని నుంచున్నపాటున తీసుకురమ్మన్నారండి.'

'మందుకి చీటీ ఇస్తాను పట్టుకుపో. మరేం ఫరవాలేదు, పొద్దుటే వస్తానన్నానని చెప్పు.'

ఇంతలో, ఆర్చి మళుపు తిరిగి రోల్స్‌రాయ్స్ కారొకటి నిశ్శబ్దంగా లోపలికి పాకిరింది. నలభై యేళ్ళవ్యక్తి, తొందరగా కారుదిగి, గుమ్మందగ్గిరకొచ్చి:

'డాక్టర్! ఏమిటింకా ఆలస్యం చేస్తున్నారు. కొంప మునిగి పోతుంది. చిట్టికి జ్వరం హెచ్చిపోయింది. చప్పున రావాలి.'

'వెంకట్రావుగారూ! మీలాటివాళ్ళే ఇలా ఖంగారుపడితే ఎలాగ? జ్వరం ఎంతఉంది?'

'నూట ఒకటి?'

'దీనికేనా ఇంత ఖంగారు? అమ్మాయికేం పరవాలేదు...వొట్టి అజీర్తిమీద కాస్తూన్న జ్వరం గాని...'

'రాక తప్పదు. నాకు మాచెడ్డ ఖంగారుగావుంది. విజిటింగ్ ఫీజు కోసమని మీరు జంకవద్దు...ఎంతయినా సరే యిస్తా. మీరు వచ్చి చూస్తే చాలు మాకు భరోసాగా ఉంటుంది.'

'ఎంత తెచ్చేరు ఫీజు?' అన్నాడు, నిశ్చలంగా, డాక్టరు మోహనరావు.

వెంకట్రావు తుళ్ళిపడ్డాడు, తనొక జమీన్‌దారుగదా, ఇంత నిక్కచ్చి చెయ్యగలడా, ఎంత పేరుపడ్డ డాక్టరైనా అనుకున్నాడు. తీరా మాట వచ్చేసింది. హోదాకి తక్కువ ఉండకూడదు...

'వంద!...' అన్నాడు నెమరు వేస్తూ.

'బా...బూ!' ఆర్తారవం... దూరంగా... గేటుదగ్గిర ... చీకట్లో...

'ఎవరది?'అన్నాడు మోహన్.

'డా...క్ట ..రు... బాబూ! ...రక్షించండి...నా . యనా! ...పిల్ల...చచ్చిపోతోంది ..బాబూ...!'

ఆవ్యక్తి లోపలికొచ్చింది. ఆర్చిలోని విద్యుద్దీపం పద్ధెనిమిదేళ్ళ శల్యంమీద మెరుస్తోంది. ఆమెకు ఒంటినిండా బట్టయినా లేదు. కళ్ళనీళ్లు జలజల రాలుతున్నాయి. చేతులు రెండూ జోడించి నించుంది, దైన్యం స్వరూపంపొందినట్టు ..

'ఎవరునువ్వు? ఏంకావాలి?' అన్నాడు మోహన్.

'బాబూ! ...అ ...నా.. థ ...పక్షిని...నాపిల్ల ...చచ్చి .. పోతోం...ది...రక్షిం...చండి!' అని కూలబడింది.

'ఇప్పుడేమిటీ వెధవగోల! .. డాక్టర్! చప్పునరారూ?' అన్నాడు వెంకట్రావు.

మోహన్ అలాగ ఆమెవేపే చూస్తూ అన్నాడు. 'వెంకట్రావుగారూ! అయిదువందలు తక్కువైతే కాలు కదపను'

'ఆఁ?'

'అయిదువందలు. అదైనా రెండునిముషాలు. అంతే! చప్పున చెప్పండి! ఈమె ఇంటికి వెళ్లాలి వేగం!..'

వెంకట్రావు కోపం దిగమింగుకొని. 'సరే, రండి!' అన్నాడు.

నీరుల్లి మగణ్ణియేర్చికూర్చేది

నీరుల్లి అంటే సాధారణంగా అందరికీ నీరసభావం.

పెద్దలు దానిని సాత్వికాహార పదార్థం కాదంటారు.

నీరుల్లి వాసనను సాధారణంగా అందరూ ఈసడిస్తారు.

కాని, వాటిని ఎందరు ఎన్నివిధాల ఆక్షేపించినా, వాటిని తరుగుతూ ఎందరు ఎన్ని కన్నీళ్లు కార్చినా ప్రపంచంలో వాని ప్రాముఖ్యం తగ్గిపోలేదు.

ఒకప్పుడు నీరుల్లిపాయలు వధువులకు వారికి తగిన వరుల్ని ఎంచుకునే సాధనాలుగా వుండేవి.

నలుగురు లేక ఐదుగురుగా వుండే పెళ్ళికొడుకుల్లో తమకు తగినవాడు ఎవడో తెలిసికోడానికి పూర్వకాలంలో కొన్నిదేశాల్లో కన్యలు నీరుల్లిపాయల్ని ఆశ్రయించే వారు.

ఆకన్యలు నాలుగైదు నీరుల్లిపాయలు తీసుకుని వానిమీద వరులపేళ్ళల్లో మొదటి అక్షరాలు వ్రాసి ఒకమూల చీకట్లో పడేసేవారు.

రెండుమూడు రోజులు పోయాక వానిని తీసి చూసి అందులో ఏపాయ ముందుగా మొలకలెత్తితే ఆ పాయమీద పేరుగల వరుణ్ణికాబోయే భర్తగా ఆకన్యలు స్వీకరించేవారు.

మోహన్ నౌఖర్ను పిలిచి, "నేను రెండునిముషాల్లో తిరిగివస్తాను, కారు సిద్ధంగా ఉంచమను డ్రైవర్ని లేపి," అన్నాడు వెంకట్రావుగారి కారెక్కుతూ.

'అమ్మా! ఇప్పుడే వస్తా, కూచో!' అన్నాడామెతో కారు ముఖపు తిరుగుతూంటే.

* * *

మోహన్‌రావు పేరుపొందిన డాక్టరు. అంత అమృతహస్తం లేదని ప్రతీతి. అంచేత గొప్పవాళ్ళంతా, జలుబుచేసినా, కొంచెం జ్వరం తగిలినా, కాలు బెణికినా. అతడికి వందలిచ్చి పిలిపించుకొనేవారు. కనీసం రెండువందలు తక్కువలేదు విజిట్‌కి. అతణ్ణి పిలిపించడం గొప్పవాళ్ళకు ఒక ఫాషన్!

* * *

మీరీపై రెండు ముక్కలూ, చదివేలోపున, మోహన్ తిరిగి వచ్చేడు.

'అమ్మా! అలా, ఆకారులోకి పద ..' అన్నాడు మామూలుగా, ఆసుపత్రిలో చీటీలు రాస్తూ ప్రశ్నలు వేసే గొంతుకతో...

'బాబూ! ...నేనే? ...కారులో!...నాకు గుండె...'

'నోరుమూసుకుని చెప్పినట్టు చెయ్యి! అవతల పిల్ల ఏస్థితిలో ఉందో? ..ఊఁ...ఎక్కు వేగం?...'

'పేద...రా...ల్ని...'

'ఒరేయ్ అప్పడూ...పట్టుకుని కారులో వెయ్ దీన్ని! లేకుంటే

వెర్రిముండ కూతుర్ని చంపేసుకుంటుంది ఈ ఆలస్యంలో!'......

అరగంటలో తిరిగి వచ్చేడు మోహన్. కారులో తల్లీ, పిల్లా కూడా వచ్చేరు. వెంటనే హాస్పిటలుకు తిప్పేడు కారు, మందులపెట్టె తీసుకుని. దారిలో: 'అమ్మా పిల్లకి శస్త్రచికిత్స చెయ్యాలి. ప్రమాదం ఉండకూడదు. ఆపైన భగవంతుడి దయ!'

ఆమె మాటాడకుండా, కళ్ళ నీళ్లు కారుస్తోంది.

'నువ్వు ధైర్యం చిక్కబడితే, నాకు సగంబల?' అన్నాడు డాక్టర్.

కారు ఆసుపత్రిదగ్గిర నిలిచింది ...పిల్లని శస్త్రచికిత్సాలయానికి తీసుకెళ్ళేరు. తల్లిని ఒక గదిలో కూర్చోపెట్టేరు. దామలిటూ, అటూ తిరుగుతున్నారు అడావిడిగా.

పావుగంట...

అరగంట .

ఎలావుందో? ... బతుకుతుందా?...ఈడాక్టరుగారు డబ్బడిగితే! .. చూసిరావడానికే ఐమువందలు పుచ్చుకున్నాడు!...తనదగ్గిర లేదంటే ..పీక తీసేస్తాడా? .. టంగు, టంగున, మూడుగంటలు కొట్టింది గోడమీద గడియారం .. ఆమె త్రుళ్ళిపడ్డది ..

మోహన్ కొత్త తువాలు మడతతో చేతులు తుడుచుకుంటూ పైకి వచ్చేడు. కళ్లు చింతనిప్పుల్లా ఉన్నాయి నిద్రలేక. నోట్లో సిగరెట్టు కాలుతోంది అలసిపోయిన చిరునవ్వుతో, 'ఇక ఫరవా లేదు' అన్నాడు

ఆమె 'ఆఁ?' అని వెనక్కు జేరబడ్డది ..

* * *

'బాబూ' . నిరుపేదరాల్ని .. ఇంతకన్న ఇవ్వలేను'' అని తన చేతి గాజులజత తియ్యబోతోంది ఆమె, తనబిడ్డ ఇంటికివచ్చిననాఁడు.

అతడు నవ్వుతూ 'అదేఁవిటి? నేనే ఇంకా నీకు మూడువందలు బాకీ ఉన్నాను. ఆ వేళరాత్రి వెంకట్రావుగారివద్ద అయిదువందలూ పుచ్చుకున్నది నీకూతురుకోసఁవే. ఆయన పిల్లకేం, తెగులు! పోతులాగున్నది. ఆమన్నాటికే జ్వరం వదిలి పోయింది! ఇదిగో సొమ్ము! అమ్మాయికి పెళ్ళిచేసుకో...ఊఁ! ...ఇక వెళ్లు.. అట్టే వాగకుమీ నాకు తలనొప్పి!' అని తలుపేసుకున్నాడు, నవ్వుతూ

ఉప్పు ఏల తింటాము?

మనం ఉప్పుతినకపోతే మనంతినే పంచదార నిరుపయోగమౌతుంది. నిరుపయోగం కావడమే కాదు ప్రమాదిస్తుంది కూడాను.

ఉప్పు తినకపోతే మనకు జబ్బు చేస్తుంది. మన రక్తంలోని పంచదార పాలు ఎక్కువ అవుతుంది అందుతో మధుమేహం ఏర్పడుతుంది.

పంచదార రక్తంలో ఎక్కువ ఏర్పడకుండా అది శరీరకార్యానికి ఉపయోగపడేటట్లుగా ఉప్పు మనకు మేలు చేస్తుంది.

ఉప్పులోవున్న క్లోరిన్ అనే పదార్థం ఈపనిని చేస్తుంది. మధుమేహ చికిత్సలో పాశ్చాత్యవైద్యులు వాడే 'ఇన్సులిన్' అనే మందులో కూడా క్లోరిన్ వున్నది.

పెళ్లి పెటుకులు

కొరియాలో

పెళ్ళైన తరవాత రెండురోజుల వరకు పెళ్ళికూతురుఆమెన మగణ్ణి చూడకూడదు. పెనిమిటిని చూడకుండా వుండేటంగుకు ఆరెండు రోజులు జిగురుపెట్టి పెళ్ళాం కనురెప్పలు అంటిస్తారు.

దక్షిణ ఆఫ్రికాలో

స్వాజి జాతి పడుచు పెళ్ళి నిశ్చయమయ్యేవరకు తలకట్టు పొడుగ్గా పెంచుకోకూడదు.

పనామాలో

పెళ్ళిచేసుకునేటప్పుడు పడుచులు తలకట్టు అంట కత్తిరి వేయించుకోవాలి.

మొరాకోలో

మూర్ జాతి పెళ్ళికొడుకుని అతనికి అంటివుండే పీడలు తొలగిపోవడానికిగాను అతని బ్రహ్మచారి మిత్రులు పట్టుకొని కొడతారు.

బెర్బరుజాతి పెళ్ళికొడుకులు పెళ్ళైన తరవాత అత్త, వదిన, మరదలు, మామ, బావ, మరది మున్నగువారితో కొన్ని నెలలపాటు మాట్లాడకూడదు.

యుగోస్లావియాలో

పెళ్ళిరోజంతా పెళ్ళికూతురు తెరచాటున వుండాలి. ఆ తెర బాగా పెద్దదిగా గుడారంమాదిరిగావుంటుంది.

పిల్లలు ఎందుకు నవ్వుతారు?

పిల్లలు ఎందుకు నవ్వుతారు అనే విషయాన్ని గురించి శాస్త్రవేత్తలు దీర్ఘ పరిశోధనలు సలిపి దిగువ నిర్ణయాలు చేశారు.

పరిశోధనకు పాల్పడ్డ పిల్ల మొదటిసారి 39-వ రోజున నవ్వింది. ఆనవ్వు పాలు తాగబోయే సందర్భంలో. అది ఆహారసంబంధమైన నవ్వు అన్నమాట.

నవ్వుకు రెండో కారణం సాంక్రామికం. పిల్లకు అప్పుడు పదోవారం. తల్లిదండ్రులు చెంతవుండి నవ్వగా పిల్ల కూడా నవ్వింది.

పన్నెండువారాలు రాగా పిల్ల ఆకర్షవంతమైన, కాంతివంతమైన వస్తువులు చూచి నవ్వుతూవుండేది.

మరి ఆరువారాల అనంతరం కాని పిల్ల నిజమైన నవ్వు నవ్వలేదు. అప్పుడు తాను చిన్న చప్పుడుకు అనవసరంగా భయపడ్డానని తెలుసుకుని పిల్ల నవ్వింది.

ఆరునెలలు రాగా పిల్ల తరుచు నవ్వడానికి ఆరంభించింది. అది చేసే పనులు అనుకరించినప్పుడు, 'ఛీఛీ' మున్నగు అక్షరాలు రెట్టించి పలికినప్పుడు పిల్ల నవ్వేది.

అనుకరణస్వరంతో తల్లి మాట్లాడగా పిల్ల గుర్తించి నవ్వింది. ఇది జరిగింది ఏడోమాసంలో. ఇది తెలివిగలిగి నవ్వడం అనవచ్చు.

పిల్లలనవ్వుకి తొమ్మిదోకారణం దరిమిలా కొద్దిరోజులకే కనిపించింది. తన తాహతుకు మించిన పెద్దపని ఏదేనా తాను చేయగలిగినందుకుగాను పిల్ల నవ్వేది.

పిల్లలు నవ్వడానికి పదోకారణం ఇతరుల కష్టపాటు. ఇతరులు పడుతోండగా చూసి నవ్వడం మొదలయినవి ఈ జాతివి. పెద్దలయిన వారిలో ఈరీతి నవ్వు మనం తరుచు చూస్తాము.

సందేహం

సాధనసమితి సభ్యుడు

శ్రీ బూర్గుల రంగనాథరావు

వ్రాసినది

ఎందుకు ఎందుకు ఈజీవం?
'ముక్తి' దేనిని అంటారు?
నిజమైనట్టి జీవన్ముక్తి
ఎప్పుడు లభ్యం ఔతుందీ?
దేనిని మోక్షం అంటారు?

చావా, జీవికి నిజమా అంతం?
...కాదు... కాదు... మృత్యువు
కన్నా
ఉత్తమమైనా అంతం కలదు!!

....
దానిని ఏమిటి అంటారు?
తెలిసినవారూ చెప్పండీ
జీవితమర్మం తెలుపండీ
పరమరహస్యం పరమరహస్యం.
అసంతృప్తి మానవ ఆత్మకు
ఎన్ని ఉన్నా ఎందుకు చెప్పండీ?

శాంతిలోనూ సౌఖ్యం సున్నా,
కీర్తిలోనూ ముక్తీ శూన్యం.
పుణ్యజీవికైనా ధన్యజీవికైనా
పేరుకు ఉండదు సంతృప్తి
ఎందుకు ఉండదు చెప్పండీ?

అన్నివిధాల సౌఖ్యం ఉన్నా
తృప్తిమాత్రం ఆత్మకు లేదు
ఏదోబాధ ఏదో విసుగూ
మానవదేహం ఉన్నన్నాళ్లు
ఉండనె ఉంటుందీ.

....
లేక ఇవన్నీ ఆలోచనతో
పుట్టగొడుగులట్లూ పుట్టినవేనా?
యోచనమానీ, చింతను వదిలీ
వేదాంతాన్ని వైరాగ్యాన్ని
పారదోలి ప్రకృత కార్యం
లోన మున్గితే, సౌఖ్యం ఉందా?
....
అప్పటికైనా పోదు అసంతృప్తి!!!

ఎవ్వరెరుగుదు రీ మర్మంబు
అతిగంభీరము అతిగోప్యమ్ము
ఈరహస్యసూత్రం ఎవ్వరి కెరుక?
....
కష్టములోనే జీవితఫలమూ
దుఃఖంలోనే ప్రపంచవృత్తం
ఏడుపులోనే ఆత్మవిముక్తీ
ఆశలు కోర్కెలు మానవ ప్రాణికి
ఆధారాలు!

స్థైర్యంలోపల సౌఖ్యం లేదూ
మనం ప్రపంచమెంట
దశావిపర్యయంలోన
లీనం కావాలి
అప్పటికైనా...ఏమొ??

పల్లెపదాలు

[వీనిని సేకరించినది దేవగుప్తాపు వెంకటరమణమూర్తి పంతులుగారు వీనిని వరి ఊడ్పులలో విశాఖపట్టణం మండలంలోని స్త్రీలు పాడుతారు. 'రామనా చందినాలో' అను పల్లవి ప్రతి చరణము మొదటను పాడుతుండాలి. ఈపాటలోని మొదటి రెండు భాగాలు గత సంచికలో ప్రచురితాలు ఐనాయి. ఇక్కడ ప్రచురితమైనది మూడోభాగము. పై సంచికలో మరిఒక భాగము ప్రచురిస్తాము. —సంపాదకుడు.]

3

నోమినోమల్లారా నోమన్నలారా
రామన్న భీమన్నా చెక్కినాకర్రా
తోలెనే రామన్నా నల్లరేవడికీ
నల్లన్న రేవడులు తెల్లన్నమన్నీ
తెల్లన్న రేవడులు తేజముగ దున్నీ
విజయనగరము వెళ్ళీ విత్తనములు దెచ్చీ
నల్లకొండబుపయినీ జల్లిరారన్నా
మొక్క మొలిచిందేమో చూచి రారన్నా
మొక్కయితే మొలిచిందీ మోగు దొడిగిందీ
చూచికడి వెడునీళ్ళూ బోశిరారన్నా
ఆకులేసిందేమో చూచిరారన్నా
ఆకులే వేసిందీ అరచెయ్యిఅంతా
చూచికడి వెడనీళ్ళూబోసిరారన్నా
జంటలేసిందేమో చూచిరారన్నా
చూచికడి వెడునీళ్లూ బోసిరారన్నా
పువ్వుపూసిందేమోచూచిరారన్నా
పువ్వుయితె పూసిందీపుస్తెంతగద్దూ
కాయకాచిందేమో చూచిరారన్నా
కాయయితెగాసిందికడవంతగద్దూ
పండుపండిందేమోచూచిరారన్నా
పండయితేపండిందీ పలువరసబోలూ
పండు ఎవ్వరిబోలు ఓలచ్చుమన్నా
పండుమనసీతమ్మా పలువరసబోలూ
కాయలెవ్వరిబోలూఓలచ్చుమన్నా
కాయ మనసీతమ్మా కంరానబోలూ
పువ్వులెవ్వరిబోలూ ఓలచ్చుమన్నా
పువ్వుమనసీతమ్మా పుస్తెల్లాబోలూ
ఆకు లెవ్వరిబోలూ ఓలచ్చుమన్నా
ఆకుమనశీతమ్మా అరచెయ్యిబోలూ
గుత్తులెవ్వరిబోలూ ఓలచ్చుమన్నా
గుత్తుమనసీతమ్మా గుత్తులేబోలూ
మొదలు ఎవ్వరిబోలూ ఓలచ్చుమన్నా
మొదలు మనసీతమ్మా మోకాలుబోలూ
పళ్లుబోయినబళ్ళూ పంచనున్నాయి
పంచనున్నబళ్ళూ బయటికే దీసే
ఆవూరికంసాల్ని పిలిపించినాడూ
విశ్వబ్రహ్మకోమకా ఇంద్రనీలుండా
పలకెట్టియీబళ్లు బాగుచెయ్యాలీ
చింతగున్నలక్రిందా చిరుకోలుము బెట్టీ
కోలకితూమడుధనమూ కోలుము లే బోసీ
కొలిచి తూమడుధనమూ కోలుము లె బోసీ
ఉల్లితోరలావంటీ ఊకపై బోసీ
నేరేళపండొంటీ నీలాలుబోసీ
నిమ్మపండూవంటీ నిప్పొక్క టేసీ
జోడుతిత్తులదండూ బోరుకలిపేమా
వూదేటితిత్తులూ ఉరుముటనుబోలీ
కాకగనుకొన్నాడే కమ్మరిబ్రహ్మ
దాగలీబూదకీ డీకొలిపినాడే
వేసేటిసమ్మెటలూరణభేరిమ్రోతా
ముక్కబోయినవద్దా ముక్కలమరించీ
ఇరుసుపోయినవద్దా ఇరుసులమరించీ
రేకుబోయినవద్దా రేకులమరించీ
వుద్దిబోయినవద్దా వుద్దులమరించీ
దండిబోయినవద్దా దండిలమరించీ
తెడపబోయినవద్దా తెడపలమరించీ
ఇసుకలో ఆబళ్ళూ ఇమ్ముగానిలిపీ
పసకలో ఆబళ్ళూ బాగుగా నిలిపీ
ఆప్రొద్దుబోనిచ్చీ ఆమనూనాడూ
మంచిముహూర్తమునూ ఎంచి పడికట్టీ
ఆదివారమునాడూ అష్టమీనాడూ
మంగళారము మొదలూ పంచమీనాడూ
దశమిదశమీనాడూ ద్వాదశీనాడూ
శుక్రవారమునాడూ చుక్కప్రొద్దేళా
ఆనల్లకొండలికీ బళ్లుతోలేరూ
ఎంచిపూచీనారూ యల్లకోస్తాలూ
పట్టిపూచీనాగూ పైడికోస్తాలూ
ఆనల్లకొండలికీ బళ్లు వెళ్ళేయీ
పళ్ళనిదంపేమా బళ్ళకెక్కించి

తోలినారా బళ్ళూ తోట వెంబడిని
పట్టితోలినారూ జగ్గన్న గుడికీ
గుళ్ళోను జగ్గయ్యా పళ్ళుగొనవయ్యా
యీపండు విలువల్లూ జెప్పమంటారూ
పండుకీ పదిలమూ యివ్వమంటారూ
గుళ్ళోను లచ్చమ్మ పువ్వులమ్మ పువ్వులే
యీపండు విలువల్లూ జెప్పమంటారూ
పువ్వుకీ పుట్టెడూ మొగ్గ కేనూర్లు
ఇంతవిలువల్లయితే ఎవరు కొంటారూ?
ఇక్కడికి కూర్మయ్య ఎంతదూరమ్మూ?
అల్లవిగో నేరళ్ళూ తెల్లనాగుళ్ళూ
తోలినారా బళ్ళూ తోట వెంబడినీ
పట్టితోలినారే కూర్మయ్య గుడికీ
గుళ్ళోని కూర్మయ్యా పళ్ళుగొనవయ్యా
యీపండు విలువల్లూ జెప్పమంటారూ
పండుకీ పండెత్తూ బంగారమెత్తూ
యింతవిలువల్లయితే ఎవరు కొంటారూ?
గుళ్ళోని లచ్చమ్మ పువ్వులమ్మ పువ్వులే
యీపువ్వు విలువల్లూ జెప్పమంటారూ
పువ్వుకీ పుట్టెడూ మొగ్గ కేతొంభై

రేపు, నిన్న, నేడు

రేపు అనేది ప్రామిసరీనోటు వంటిది.

నిన్న అనేది కాన్సిల్ చేయబడ్డ బ్యాంక్ చెక్కువంటిది.

కాబట్టి చేయవలసినపనిని నేడే చెయ్యి

యింతవిలువల్లయితే ఎవరు కొంటారూ?
యిక్కడకు రామయ్యా ఎంతదూరంబూ
అల్లవిగో నేరళ్ళూ తెల్లనాగళ్ళూ
తోలినారా బళ్ళూ తోట వెంబడినీ
రామన్నగుడివద్ద నిలిపినే బళ్ళూ
గుళ్ళోను రామయ్యా పళ్ళయ్యా పళ్ళూ
యీపండు విలువల్లూ జెప్పమంటారూ
పండుకీ పండెత్తు బంగారమెత్తు
గుళ్ళోని లచ్చమ్మ పువ్వులమ్మ పువ్వులే
యీపువ్వు విలువల్లూ జెప్పమంటారూ
పువ్వుకీ పుట్టెడే మొగ్గ కేనూరూ
ఇంత విలువల్లయితే ఎవరు కొంటారూ?
యిక్కడకు నరశింహ ఎంతదూరంబూ
అల్లవిగో నేరళ్ళూ తెల్లనాగుళ్ళూ
తోలినారా బళ్ళూ తోట వెంబడినీ
నరసింహగుళ్ళోకే తోలినే బళ్ళు
గుళ్ళోని నరసింహా పళ్ళయ్యా పళ్ళు
యీపళ్ళు విలువల్లూ జెప్పమంటారూ
పండుకీ పదిలమూ తొక్కతొంభై
ఇంతవిలువల్లయితే ఎవరు కొంటారూ?
గుళ్ళోను లచ్చమ్మ పువ్వులమ్మ పువ్వులే
యీపువ్వు విలువల్లా జెప్పమంటారూ
పువ్వుకే నూర్వేలూ యివ్వమంటారూ
ఇంతవిలువల్లయితే ఎవరు కొంటారూ?

మహావాక్యరత్నాలు

సౌఖ్యం

సౌఖ్యం అది ఎప్పుడుకాని లేకుండా వుండదు. కాని దాని ఉనికిని మనం తరుచు కనుక్కోలేక పోతున్నాము.

—Maeterlinck

.. .. ..

కోపసమయం

కోపంగా వున్నప్పుడు తొందరపడి ఏమీ చేయవద్దు. అట్లా చేయడమల్లా తుపానసమయంలో సముద్రయానం చేయ ప్రయత్నించినట్లు ఔతుంది.

—Thomas Fuller

... ...

కోరికలు

కోరికలు ఎంత తక్కువగా వుంటే మనశ్శాంతి అంత ఎక్కువగావుంటుంది.

—Bishop Wilson

.. .. ..

ఆనందం

అన్ని వస్తువులూ అందరికీ లాభకరాలు ఐవుండవు. అట్లాగే ప్రతి ఆత్మకీ ప్రతివస్తువులోనూ ఆనందముండదు.

—Ecclesiasticus

... .

అవకాశం

నిజంగా గొప్పవాడైనవాడు ఎవడు కాని అవకాశం లేకపోయింది అనే సాకు చెప్పడు.

—Emerson

... .

గొప్పవాడి మోసం

ఎవరైనా ఒక గొప్పవాడు నిన్ను డబ్బువిషయంలో మోసగిస్తే, నీవు డబ్బును పోగొట్టుకుని ఊరుకో. అంతేకాని ఎవరితోనూ చెప్పవద్దు.

—Dr Filler

మరికొన్ని ఆకుకూరలు

[ఫిబ్రవరి మాసపు ఆంధ్రభూమి సంచిక ప్రత్యేకం ఆకుకూరల సంచికగ ప్రచురించివున్నాము. అందులో 31 ఆకుకూరల్ని గురించిన వివరాలు వున్నాయి. అది పలువురి ప్రశంసలను అందింది. బహుజనులు దానికోసం ప్రత్యేకం లేఖలు వ్రాసివున్నారు. ఆ దలి విషయాలన్నీ ఒక యల్. ఐ. మ్. డాక్టరు వ్రాసినవి. అందులో లేని కొన్ని ఆకుకూరల్ని గురించి ఈ వ్యాసకర్త వ్రాసి పంపారు. శ్రీ వారు వృద్ధులు. ఇందలి విషయాలు వారు అనుభవపూర్వకంగా వ్రాశారని నమ్ముతున్నాము. —సంపాదకుడు.]

రచయిత:

పురాణం పిచ్చయ్యశాస్త్రి

దొండాకు

ఇది తీగలుపారి చెట్లమీద అల్లుకొని వుండేది. దీనికి బింబా అనిన్నీ, దీనిపండ్లకి బింబఫలాలనిన్నీ సంస్కృతంలో పేరు [illegible] ను తెచ్చి తరిగి [illegible] లాగా కొంచెం నేయి వేసి పెట్టి పొరటుకూరగా చేసి తిరగబోత వేసి తినవచ్చును ఇది చిరుచేదుగా వుంటుంది కాని కాకరకాయలంత చేదు వుండేదికాదు. దీని [illegible] ముప్పు [illegible] దగ్గ, [illegible] వృద్ధి [illegible] స్తుందని అంటారు [illegible] ము దలైన వాతరోగాలు వున్నవాళ్ళకి యిది చాల మేలుచేస్తుందని వైద్యులమతం. మూత్రరోగంగలవాళ్ళకికూడా యిది మేలుచేస్తుంది.

తుత్తిరాకు

చిన్న చెట్లుగావుండే దీని ఆకులను తెచ్చి కాడలుతీసి సన్నగా తరిగి పప్పువేసి ముద్దగా వండును, పొరటుకూరగా చేసినను రుచిగావుండును. ఇది [illegible] మే వ్యాధిగల వారికి నిండా మేలుచేయును దేహము యెక్కువ వేడిగా నుండిన తగ్గించును. ఆకలిగలిగించును. అయితే దీనిని యెక్కువగా తిన్నయెడల మలబద్ధకము గావించు గుణముగలదు [illegible]

గోలిమిడాకు

ఈచెట్లు వరిచేలగట్లులపై యెక్కువగావుండును. ఇది సోగయాకులుగలది. ముండ్లచెట్ల జాతిలో చేరినది ఈయాకులు తెచ్చి తరిగి పొరిటి తిందురు. కాని సాధారణముగా తినెడి ఆకుకూరలవలె వాడుటలేదు. ఈకూర యించుక వగరును, చేదును గలిగి వుండును. సంజువ్యాధిగల వారికిని, వాతరోగులకును యిది మిక్కిలి యనుకూలమైనది.

మంకెనకూర

ఈకూర పయిరు వేయుటకై భూములు దున్నినపుడు మాగాణి చేలలో మిక్కుటముగా మొలచును సన్నని రంగుతో బిళ్ళలు బిళ్ళలుగా నొక్కులుగల కొనలుగలదై యుండును దీనిని తెచ్చి కడిగి వుప్పు వేసి ఉడకబెట్టి పొరిటి కొంచెముగా మిరపకాయలపొడి చల్లి తిరగబోత వేసి యన్నములో కలుపుకొని తిందురు. ఇది మిక్కిలి రుచికరముగను మే[illegible] శాంతికరముగను వుండును మూలవ్యాధిగలవారు పిమ్మట పదిదినములు ఈకూరను ఉపయోగించిన యెడల బాధ శమింపజేయును. ఇది అన్ని రోగములలోను పథ్యకారియై ఆరోగ్యమును గలిగించును.

పాలికూర

[illegible]- పెద్దపాలి యను [illegible] రెండువిధములు సాధారణముగా గ్రామములలో తోటలందును, గోడలవెంబడిని యిది మొలచుచుండును. చిన్నతీగలు పారి

భూమినంటి వుండును వీనిని నలిపినయెడల కొంచెము జిగటగా వుండును. చిట్టిపావిలి మిక్కిలి చిన్నవియైన ఆకులుగలది. పెద్దదాని యాకులు పెద్దవి. ఈరెండును గుణమున నొకటియేగాని రూపమునందును, రుచియందును కొంత భేదముగలిగి వుండును. సాధారణముగా పల్లెటూళ్ళలో ఈకూరలను పేదవారు కోసి తెచ్చి, చింతకాయలుగాని, చింతపండుగాని, మామిడికాయలుగాని చేర్చి, ఉప్పుకారములుకూర్చి పులుసుకూరగా చేసి వుపయోగింతురు. ఈకూర మేహవ్యాధిగలవారికి అనుకూలముగా వుండును, కాని, విరేచనకారి. కొంచెము పిత్తమును ప్రకోపింపజేయును- పప్పుచేర్చి వండిననే తప్ప ఇది రుచిగా వుండదు. ఈకూర యించుక వెగటుగానుగలదై వుండును, పెద్దదానికంటె చిన్నదే బాగా వుండును

బొద్దికూర

తెల్లని చిరుబొద్ది, పెద్దబొద్ది అని రెండువిధములు. చిరుబొద్దని పిండిబొద్ది అనికూడ అందురు. పెద్దబొద్దికన్నను చిరుబొద్దియే రుచిగానుండును. [illegible] గ్రామములలో ఎక్కువగ [illegible] బీటిపొలములందు [illegible] వుండును. దీనిని తెచ్చి [illegible] చేసి, పులుసుకూరగాగాని, పొడిగాగాని భుజింతురు. ఎట్లుచేసినను యిది మిక్కిలి రుచిగా వుండును మిక్కిలి పథ్యకారులైన ఆకులలోనిది ఒకటి యగును. సీటిచురుకుగలవారును, అంటువ్యాధిగలవారును దీనిని ఉపయోగించినచో మిగుల మేలుచేయును. అతిమూత్రము నడంచుశక్తి దీనికెక్కుడుగా గలదు. వైద్యులు పిండిబొద్దియే శ్రేష్ఠమని చెప్పెదరు.

విశ్వామిత్రుని చేమకూర

ఇది పల్లెటూళ్లల్లో పొలముల్లో సాధారణముగా మొలచును. ఆకులు కాడలు మంచి చేమకువలెనే యుండును. కాని, యవి మిగుల చిన్నవిగా నుండును. భూమిపై బెత్తెడు పొడవునకు యెక్కువగా పెరుగవు. దీనిగడ్డలు వేపగింజలంతగా వుండి అపరిమితమైన నసగలవగుటచే వానినెవ్వరును నుపయోగింపరు. సన్నవగు దానికాడలకును అట్టిగుణముగలదు. కాబట్టి ఆకులనుమాత్రము గిల్లి తెచ్చి పెసరపప్పుచేర్చి తియ్యగూరగను, పుల్లగూరగను వండుకొని తిందురు. పక్వములో తప్పినయెడల యించుక నసగలిగించును. ఈకూరవలన గలుగు గుణము మహోఘమైనది. విరేచనకారి. అగ్నిమాంద్యమును పోగొట్టును. కడుపులోని పురుగులను చంపును. ఆకలి కలిగించును. చలువదనముగలుగును. వాతరోగులు మాత్రము దీనిని వాడకూడదు. తక్కినవారికి ఎంతయు ఆరోగ్యదాయకమై వుండును.

పల్లేరుకూర

దీనికి సంస్కృతములో గోక్షురకమని పేరు. ఇది గ్రామములలో బీటిపొలములందు విశేషముగా మొలచి భూమికంటిన చిన్నతీగలుగలదై పరపుగా వ్యాపించును. దీని ఆకలు మిక్కిలి చిన్నవి. ముదిరినంతట దీనినుపయోగించుట ప్రయోజనముగాదు. లేతగానుండునపుడు కాడలతో కోసి తెచ్చి బాగుచేసి, పప్పుచేర్చిగాని, వట్టిదిగానేగాని వండుకొందురు. దీనిని పొరటుకూరగా తప్ప మరియొకలాగున చేయుట కుపయోగింపదు. మిక్కిలి రుచిగా వుండును. మలబద్ధకము, ఆకలి లేకుండుట, కటివ్యాధులు, నోటికురుపులు వీనిని ఇది ఖండితముగా పోగొట్టును. మేహవ్యాధికి గూడ ఇది మంచిచేయునందురు.

గునుగుకూర

ఈకూర పొలములలో చల్లని ప్రదేశములందును, సాధారణముగా తోటలలోను మొలచును. సన్నని నిడుపైన ఆకులుగలిగి మొలకలుగానుండును. దీనిని తెచ్చి పుల్లగూరగా చేయుదురు. తియ్యగా వండినచో అంత రుచిగానుండదు. ఇది మలముతో రక్తముపడుట, ఆసనములోను, కడుపులోను మంటగా వుండుట, దేహము దడగలిగి వుండుట మొదలైనరోగలక్షణముల నడంచుట కుపకరించును. తినుట కెంతయు రుచిగా వుండును.

అప్పు కాదు

[ఏకాంకిక]

[ప్రభాకరుడు చదువుకున్నవాడే. ఐనా అతని చదువు సంపాదన కుపయోగించలేదు. ఇంతకూ అతనిభార్య యోగ్యురాలు కావడంచేత అతడు దబాయించి తెచ్చిన డబ్బుతో వారు సఖజీవనప్రవిష్టు లవుతారు. ఆడబ్బువచ్చినతీరు తెలిస్తే ఆమె దానిని ఉపయోగించేది కాదేమో! అయితే ఇందులో ఒక మంచి సమస్య తడవబడింది. హిందూదేశంలో ప్రాయకంగా ధనం దానికి ఉచితోపయోగ్యవృత్తి కల్పించేవారి దగ్గర వుండకుండా 'ధనము గాపున్న దయ్యాలు తిరుగు'లోభుల వద్ద వుంటూవుంది. ఇది యోచింపతగింది. —సంపాదకుడు.]

రచయిత:

గుంటూరు శ్రీహరి

౧-వ రంగము

(ప్రభాకరుడు: ౩0 సంవత్సరాల వయస్సుండును, పాశ్చాత్య పద్ధతిలో వేషం, వడుస్తూ ఆలోచిస్తూ వుండును.)

ప్రభా:

స్వశక్తిపై ఆధారపడవలసిందనే సూత్రం గొప్పదే అయితే మహామేరువుకూడా నిరాధారంగా నిలబడలేదు. నిరుద్యోగ మహా సంచలన సమయంలో స్వలాభాపేక్షా పవన సంక్షుభిత మహా వాతావరణంలో నిలవాలంటే స్వశక్తి సరిపోదు, ఏ అధికారియొక్కగాని దాపు, ప్రాపు ఉండాలి. కళోపాసన, మేధాశక్తి, ఉన్నత విద్య జీవనాధారం కలగచేయడంలో నిరుపయోగం. వేలు మోపుట కాధారం దొరికితే వాటి ప్రభావం బయటకు రావాలికాని లేకుంటే అవి రాణించడంలేదు. ఇక మనవిషయంలో ఊతనిచ్చే వారెవరు? ఇచ్చకపు మాటలాడేవారు వేనకువేలున్నారు, స్వోపయోగానికి ఇతరులకు సహాయంచేసేవారు. చేసినట్లు కనబడేవారు లక్షలుగా వున్నారు. నాబోటి నిర్భాగ్యునికీ ప్రాపులుకూడా అలభ్యం. ఈ చర్చలవల్ల లాభంలేదు. ఇకచేయవలసిందేమిటి? స్వశక్తిని వినియోగించడం. స్వశక్తే పరమావధి. కరుణ, దయ, పాపభీతి, బంధుస్నేహభావాలు త్యజించాలి. సమయానుకూలంగా ముందంజవేస్తూ అడ్డు తగిలినవారిని నెట్టుతూ సాగడం పరమోత్తమం (ముందుకు సాగి ఒక అరుగుపై తామర గోకుకుంటూ, మధ్యమధ్య విసనికర్రతో విసురుకుంటూ పడుకొనియున్న వర్తకు నొకనిచూచి) బలే సమయం. పనికి ఉపక్రమించాలి.

(వర్తకునితో)

పుల్లయ్యా అంటే నీవేనా?

వర్తకుడు:

(అతికష్టంతో లేచి కూర్చుని) వేళగాని వేళొచ్చారు, మీ రెవరు బాబు?

ప్రభా:

నే నడిగిన ప్రశ్నకు సమాధానంచెప్పక అడ్డుప్రశ్న లేమిటి?

వర్త.

అడ్డప్రశ్న కాదండి. నడివేసవి, మట్టమధ్యాహ్నం కదా అండి. ఇలాటి సమయంలో ఓనాఖర్రైనా లేకుండా ఒక్కరూ దయచేసారేంటని.

ప్రభా:

మాటలతో గడుపుదా మనుకున్నావు కాబోలు నీవు పుల్లయవనే నిశ్చయమైంది ఈమేడ పదివేలకు తక్కువ విలువచేయదు. వ్యాపారంలో లాభాలు చూపడం మానేసి, పన్నులెగేసి- బంగారం, ఇళ్లూ, భూములు సంపాదిస్తున్నారు. ఈ గుట్టు బైటపడాలి.

వర్త.

బాబూ! కాస్త కూచున్నారు కారు. బుల్లోడా కుర్చీ పట్టుకొచ్చి బాబుగారికెయ్యి. వీడి నేనండి (తన్ను చూపుకుంటూ) పుల్లయ్య అంటారండి. ఎవ్వారాలు ఏలబడి నా ప్రాణాలుకు కుదుటు లేదండి. ఎవరొచ్చినా ప్రాణంమీదికే. (బుల్లోడు కుర్చీ తేగా ప్రభాకరుడందుపై కూర్చొనును.) అన్ని విధాలా ఉక్కిరి బిక్కిరి అయితే నేమండి బాబయ్యా! అల్లా మనిషికి మేడుంది మనకోటి కట్టించమని పిల్లాళ్లు శతపోరితే ఈచిన్న ఇంటిని వేశా.

ప్రభా.

మాటలతీపికి లోపంలేదు కాని పైవాళ్ళ కంఠాలు త్తరించడంలో మహాపదును, పైవాళ్ళకళ్లు కప్పడంలో ఆరితేరిన సహజమైన నిపుణత— వీటి దారుణం తగ్గించాలి (వర్తకుడు బుల్లోనికి సైగచేస్తే ప్రభాకరుడు) చూచి చూశా, చూశా, ఏదో దాచేయమంటున్నావు. దుంపనాశనం. తెలుసా.

పుల్లయ్య

అబ్బే ఏంచెయ్యడంలేదు. ఎండపడొచ్చారు. కాస్త మజ్జిగనైనా తెమ్మన్నా.

ప్రభా

మజ్జిగ తాగడానికి రాలేదు.

పుల్ల:

తెలియక అడుగుతున్నా కొత్తగా వచ్చారా?

ప్రభా.

అడ్డప్రశ్నలొద్దన్నా.

పుల్ల.

ఏంపనో తెలుసుకోవద్దండీ? పకల్లో ఉందండి వేపారం.

ప్రభా

మహాస్త్రప్రయోగి మాలోచించావా?

పుల్ల:

నాకు గుండా? బాబయ్యా!

ప్రభా

అద్దైతే పములిచ్చి లక్షలు లాగుతున్నారన్నమాట.

పుల్ల:

ఓ కథ ఉందండి.

ప్రభా

నీ కథలు నాకక్కరలేదు. కాలవిళంబన పనికిరాదు.

పుల్ల.

మరైతే అబ్బాయి! కొట్టు తలుపుతియ్యి. బాబుగారు చూస్తారంట స్వయం లేవలేను. క్షమించాలి, బాబయ్యా!

ప్రభా

అనుభవించాలనే కట్టావా ఈ మేడ. స్వంతానికి లేదు, పరులకు నిర్ధూమధామం. ఈ ఐశ్వర్యం మరో దేశీయునికంటే ఎంతోదర్జా కనబడుతుంది, పదిమందికి ఆధారం కలుగుతుంది. ఇక మీరో చదపురుగులే. వంటిగోచీ, వ్యాపార కొట్టూ— నిజం వెళ్ళడి చెయ్యవు.

(రైతు రామన్న ప్రవేశం.)

రామన్న.

(పుల్లయ్య నుద్దేశించి) బాబయ్యా! నానోటు పారేశారు కారు.

పుల్ల

నోటు పారేయడమేంటి? నోటు పారేస్తారా? ఎవరంటూ నువ్వు?

రామన్న

అనోటా బాబూ? డబ్బంతా ముట్టిపోయిందికదా నోటు కాగితం ఇచ్చేయమంటే మళ్ళీ రమ్మన్నావా?

పుల్ల:

ముందా పగటి వేషగాళ్లొచ్చారు (రామన్నకు మాటాడవద్దని సైగచేస్తాడు)

ప్రభా.

మనిషిని ఎదుట కూర్చోబెట్టి నాటకమా? తెలియనట్లు నటిస్తూ ఏమిటా సైగ, పుల్లయ్యా? వడ్డీ వ్యాపారంకూడా ఉందన్నమాట. ఇకనేం? నిజం పైకిరాక తప్పదు. నోరులేనివాళ్ల కళ్ళల్లో దుమ్ము కూడా కొట్టటం సూదంటు రాయి నయం

పుల్ల.

వందరూపాయిలండి.

ప్రభా:

అంటే

పుల్ల:

ఎందుకేనా పనికొస్తాయి.

ప్రభా:

(లేచి కొట్టువైపు వెళ్తూ) వ్యవహారం చిన్నదైనా నీతిగా వుండొద్దూ?

పుల్ల:

(మెల్లగా లేచి కొట్టులో నూరురూపాయిల నోటు తీసి రామన్న చూడకుండా ప్రభాకరుని కిచ్చును.)

ప్రభాకరుడు వాటి సందుకొని కోటుజేబులో భద్రపరచి)

ప్రభా :

ఫుల్లయ్యా! మళ్ళీ వస్తా. ఇతని వ్యవహారం సరిచూడు (నిష్క్రమించును. తెరదిగును.)

౨-వ రంగము

(ప్రభాకరుడు, భార్య మనోరమ. ప్రభాకరుడు పడకకుర్చీలో కూర్చొని సిగరెట్టు కాలుస్తూవుంటాడు. మనోరమ అల్లిక అల్లుతూ చాపమీద కూర్చొని వుంటుంది.)

మనో.

పొగ మీదకి రాకుండా వదలండి, పుణ్యముంటుంది.

ప్రభా.

పొరబాటు- పాపం నీ చిన్న కోరిక మన్నించలేక పోతున్నా. వ్యసనం అలవడిందంటే ఒదుల్చుకోవడం దుస్సాధ్యం.

మనో.

సిగరెట్టు కాల్చవద్దని నిరోధించను. అందులో ఈసంతోష సమయంలో మరీ నిరోధంలేదు.

ప్రభా

ఎన్నాళ్లో ఈసంతోషం? నూరు రూపాయిలు- ఎన్నాళ్ళొస్తాయి! పాతబాకీలు తీర్చడానికే సరిపోవేమో?

మనో

నూరురూపాయిలు తక్కువ సొమ్ము కాదు. దీనితో శాశ్వతోపాధి కలుగజేసుకోవచ్చు. పాత అప్పులలా ఉంచండి. నేను వారిని బ్రతిమిలాడుతా కొంతకాలం కాపుచేయమని నా కార్యక్రమా న్ననుసరించు ప్రయత్నానికి ప్రస్తుతం అయేఖర్చుకంటె హెచ్చుసొమ్ము తెచ్చారు. ఈ ఉపకారం మనకు చేసినవారికి మహాపుణ్యం. వారికి మనం కృతజ్ఞులమై ఉండాలి. ఎవరో వారు?

ప్రభా

ఈప్రశ్న కిది రెండోమారు. కారణాంతరాలచే దాతపేరు చెప్పడానికి వీలులేదు. గుప్తదానం. కాని దైవం అనుకూలించినట్లయితే అప్పు తీర్చివెయ్యాలి.

మనో :

తప్పకుండా, వారెంత ఉదారులైనా వారికి ఋణపడడం భావ్యం కాదు. కార్యక్రమం చూచారు కదా. మీస్నేహితులను కలుసుకొని ముందుగా చెప్పిఉంచండి. స్త్రీసమాజాన్ని ఒప్పించా, కాఫీ గుండ- టేబిల్ క్లాతులు, గుమ్మం తెరలు, గలీబులు లేసుపనితో- ఇవి మనం ప్రస్తుతం విక్రయించడం. ఆడవారి తాలూకు, పిల్లల తాలూకు బట్టలు కుట్టడం సులువైనపని. పదియిండ్లవారప్పుడే మాటఇచ్చారు. మహిళాసమితివారు సహాయంచేస్తా నన్నారు. వారు స్థాపించే• శాలికా పాఠశాలలో నేను ఉపాధ్యాయినిగా వుండడానికి ఒప్పుకున్నారు. విరామకాలంలో చిన్నపని చేయ తలపెట్టాను. ఈ జీవయాత్రతోబాటు సంఘసేవకూడా చేదామని ఉంది. స్త్రీకార్మికుల సౌకర్యాలాలోచించేవారు తక్కువ. స్త్రీకార్మిక సంఘంస్థాపించి మహిళాసమితిక, దానికి సంబంధ మేర్పరచి కార్మికజీవనం స్త్రీలకు సుఖదాయకంగా చేయడం- వారిలో విద్యావ్యాప్తిచేయడం- వారి సంతానానికి నవ్యజీవితసౌకర్యాలేర్పాటుచేయడం సేవాకార్యక్రమం. మీరు పైనుంచి అన్నీ క్రమంగా జరుగుతున్నాయో, లేవో కనిపెడుతూ ఉండండి.

ప్రభా :

నీవు కష్టపడుతూంటే తిని సుఖంగా వుండమనా నీ అభిప్రాయం?

మనో

అలాచేస్తే తప్పేమిటండీ? కాలానుసరణంగా ప్రవర్తించాలికదా? మీరుకలగజేసిన ఉపాధిపైనే నేను సాగుతున్నా. ఇక దోష మెక్కడుంది? కాకపోతే మీతీరిక సమయంలో నూలుతీయండి. మనకు కావలసిన బట్ట లొస్తాయి. ఇంకా తీరికుంటే ప్రజాసేవచేయండి.

ప్రభా.

అన్నీ ఆమోదించా. దుర్భర జీవితాంధకారంలో ఘనతారలా వెలుతురు నెలకొల్పి నాకు చేయూత నిస్తున్నావు. కృతజ్ఞుడిని.

(తెర దిగును)

3-వ రంగము

(ప్రభాకరుడు పంచ, చొక్కా, ఉత్తరీయం ఆలోచిస్తూ నడుస్తూంటాడు.)

ఈవేళ నామనసులోని బరువు పోతుంది. పెట్టుబడిసొమ్ము ఎలాగొచ్చిందీ చెప్పకుండా తప్పించుకు

న్నా. అది నయమైంది. చెప్పి ఉంటే కళంక మాపాదించి 'మనూ' ఆసామ్మును తృణీకరించేది , నిలువ నీడలేకపోయేది. ఈఒక్క మాయ వల్ల మేమెంత సుఖమయ జీవనం చేస్తున్నాం. మాయ నాగుండెలో మెరుగుతూన్నా ఆబాధ నే పడ్డాను, సుఖపడ్డాను, పాతఅప్పులు తీరిపోయాయి. జీవనానికి శాశ్వతమైన మార్గం కనబడింది. సంఘసేవచేసి ఆత్మ సంతృప్తి చేకూర్చుకుంటున్నాం. తృప్తిమయజీవనంలోవుంది ఆనందం. మనూ ఋజువర్తనం ఈ జీవితోపాధి. నా నేర్చిన విద్యలు మారని నాణేలు. నా అహం నిరర్థకం. అణకువలోఉంది ఐశ్వర్యం- ఇదిగో పుల్లయ్య ఇల్లు- (ఇంటి వసారాలోనికి వెళ్ళి పుల్లయ్యను చూచి నమస్కరించి) పుల్లయ్యగారు! క్షమించి ఈపైకం తీసికోండి (జేబులోనుంచి నూరు రూపాయిలనోటు తీసి యివ్వబోగా.)

పుల్ల :

ఎవరు బాబూ మీరు? నాకెందుకిస్తున్నారు ఈసొమ్ము?

ప్రభా :

నన్ను మరచిపోయారా మీరు? గత సంవత్సరం సూటుతోవచ్చి మీవల్ల నూరురూపాయలు పుచ్చుకున్నాను.

పుల్ల :

ఆబాబు మీరే? అద్దుప్రశ్న కాదు సుమండీ- అది అప్పుకాదు-ఎందుకిచ్చేస్తారు- ఉంచండి. మీ లాభాలు మాకు లాభాలు.

ప్రభా :

నిలువ ఆస్కారంలేని సమయంలో తిరుగుతూవుంటే మీయిల్లగపడి మీరు ఎదుటవుండడంచూచి కాల మెలాఉందో పరీక్షించే వుద్దేశంతో మీతో సంభాషణకు దిగాను. పర్యవసానం నేనుద్దేశించింది కాదు. ఒరైతురాకుంటే మీరేమి చేసివుందురో దురూహ్యం, నేనేమి చేయడానికి ఆలోచించలేదు. కాని కాకతాళన్యాయంగా అన్నీ సమకూడి నాకు నూరు రూపాయిలు అందాయి. వాటి ఆధారంగా ఉత్తమజీవితం ఎడిపాం పెట్టుబడి కూడదీయడమే కాకుండా జీవనోపాధి కలగజేసుకున్నాం మీసొమ్ము మీకు అందజేయడం మావిధి. అది అప్పులా తీసుకోకపోయినా మాకు తిరిగీ యిచ్చేవరకూ మనోభారంపోదు. అయాచితవిత్తమని కబళించడం ధర్మంకాదు. తీసుకోండి, నన్ను క్షమించండి. నేను, నాభార్యా మాజన్మాంతంవరకు మీకు కృతజ్ఞులం-

పుల్ల

ఏమిటి? మీరు ప్రభాకరరావుగారా అండి- అమ్మాయిగారు కులాసాగా వున్నారా? మీ దంపతులు ఆదర్శకులండి- బాబయ్యా! ఈవేళ సుదినం- అమ్మాయిగారిని గురించి మావాళ్లు చెపుతూంటారండి. మా వాళ్ళేందుకు- ప్రపంచమంతా ఆమె కీర్తిధ్వనితో ప్రతిధ్వనిస్తూంటే- బాబూ ఆసొమ్ము నేముట్టను- అది పవిత్రమైనది- ఏ పవిత్రకార్యానికైనా ఉపయోగించండి-జ్ఞానంతో మనసా సత్కర్మచేయాలని మాకు తోచదు- నాభయంకొద్దీ మీకాసొమ్మిచ్చా, మీ మనోభారం తీరడానికి మనసార చెపుతున్నా,అదిమీరుంచి ఏ మంచి పనికైనాఉపయోగించండి-

ప్రభా :

పుల్లయ్యగారూ! ధన్యులం.మీ జీవితక్షేమంలో ఇలాటి సత్కర్మలెన్నైనా మీరు చేయాలనీ, మీకు పూర్ణాయువు కలగాలనీ దైవాన్ని ప్రార్థిస్తున్నాను-

ఆశయభంగం

[చిన్న కథ]

[అభ్రంకషమైన ఆదర్శంతో బయలుదేరి పాతాళాని కంటా పడిపోయిన వారిలో ఈ కథలోని మోహనపాత్ర ఒకటి. ఇట్టి పాత్రలు ఒక్క సినీమారంగములోనే కాకుండా అన్ని రంగాల్లోనూ వుంటారు. కాబట్టే ఇట్టి పాత్రలు లోకసహజమైనవని చెప్పటం —సంపాదకుడు]

రచయిత:

పి. వి. సుబ్బారావు

౧

'మోహనా! నేనొందుకు చెపుతున్నానో విను.'

'నేను ఎవరు ఏమి చెప్పినా వింటాను.'

'ఈచెవిని విని ఆచెవిని విడిస్తే ఏమిలాభం?'

'లాభనష్టాల కిదేమైనా వ్యాపారమా? నీవు చెప్పవలసినది చెప్పితే నేను చెయ్యవలసినది చేస్తాను'

'నీవు అలా అంటావని నాకు తెలుసు. అయినా, స్నేహితుణ్ణి గనక హృదయపూర్వకంగా చెపుతున్నాను. నామాట విని తప్పకుండా ఆచరణలో బెట్టమని నా ప్రార్థన.'

'చెప్పవలసినది చెప్పు, ప్రార్థించ నక్కరలేదు! కొబ్బరికాయ కొట్టనక్కరలేదు'

'నీవు పెండ్లిచేసుకొని ఒక యింటివాడివైతే చూద్దామని వుంది.'

'ఈబుద్ధి నీకే పుట్టిందా? లేక ఎవరైనా చెప్పారా?'

'ఈమాత్రపు టాలోచన నీ హితంకోరే ప్రతీవాడికీ తడుతుంది. పెళ్ళీ పేరంటం జేసుకోవటము, పిల్లా మేకాతో లక్షణంగా కాపురం దిద్దుకోవటం ప్రతి మానవుడికి సామాన్యమైన విషయమే! ఇది నీకు వింతగా కనుపిస్తుంది!'

'సామాన్యంగా బ్రతకటానికి నాకిష్టము లేదు. దేశముకోసమో, కళకోసమో నాశక్తిసామర్థ్యాలు వినియోగించటము నాసంకల్పం'

'నీ ఊహ బాగానే వుందిగాని పెండ్లిజేసుకొని ఆపని సాగించటానికి ఏమిలోటుంది? భార్య పుత్రులుకూడా నీకు తోడౌతారు గాదూ?'

'కౌపీన రక్షణార్థం సంసారము తయారై మహాఋషి తపస్సు తగులబడినట్లవుతుంది. భార్యాపుత్రులు నాకు సహాయపడతారని ఎవరు చెప్పగలరు? వారు నాకుఎదురు తిరగకూడదూ? భార్యాభర్తలకు భేదాభిప్రాయాలుండి ఎన్ని సంసారాలు తగులబడ లేదు'

'సంసారము అవసరమన్న సంగతి మర్చిపోతున్నావు'

'కల్పించుకొంటే అన్నీ అవసరములే! ఏఅవసరమూ లేకుండా స్వేచ్ఛగా జీవించాలనే నా ఆశ. నా ఒకడికోసమే యింత ఆరాటపడుతుంటే మరికొందరిని నెత్తిమీ దెక్కించుకోవటము ఎలాగ?'

'నీవు మొయ్యవలసిన బరు వేముంది? చెమటూడ్చి పెద్దలు సంపాదించిన ఆస్తి కర్చుబెట్టుకుంటూ హాయిగా వుండక-'

'నీవు నూరు చెప్పు, వెయ్యి చెప్పు. నాయిష్టప్రకారము నేను చెయ్యవలసినదే! నాబుద్ధి నాకు సుఖము నిస్తుంది. పరబుద్ధి వినాశకరం'

'ఎవరైనా కొంత స్వార్థపరులుగా వుండాలి. తనకు మాలిన ధర్మం పనికిరాదు. పైగా, కుందేటివలె ఒకరు వేసినకంప దాటను- ఒకరు ముట్టిననీరు త్రాగను అనటమా? ఎప్పటికైనా నీ దుర్గతి కదే

కారణమవుతుంది.' అంటూ రాముడు వెళ్ళిపోయాడు.

౨

మోహనుడు భూమిమీద పడ్డాక కాలక్షేపం పరిణామదేవత చేతుల్లో 25 సంవత్సరాలు సాగింది.

చిన్ననాడే తల్లి గతించింది అందువల్ల తండ్రి చేతుల్లో అల్లారుముద్దుగా అరుల్లో పిడేలాగ గుమ్మనగా పెరిగాడు. గారాబము ఎక్కువవటమువల్ల విశేషము సరస్వతీకటాక్షము కలుగలేదు. రెండు సంవత్సరములక్రింద తండ్రి కూడా గతించటమువల్ల వున్న ఆస్తి అతని చేతుల్లో పడటము- వెనుక 'ఆఁ' అనేవారు లేకపోటము సంభవించింది. స్వయం రాజా, స్వయం మంత్రి, నాస్తి శత్రుభయమన్నట్లుంది. ఈ విధంగా ప్రారంభమైంది అతని జీవయాత్ర.

వేరేపని లేకపోవటమువల్ల, చేతుల్లో నాలుగుడబ్బులు ఆడుతుంటమువల్ల తరుచు సినిమాలకు వెళ్ళటము అలవాటైంది. అప్పుడప్పుడు సినిమా పేజకోసము పేపరు చూడటము, సినిమాటెక్నిక్ పుస్తకములు చదవటము ప్రారంభించాడు. అతను చుట్టుచేరిన కుఱ్ఱవాళ్ళతో చిట్టమ్మ (పుష్పవల్లి) పేరు ప్రతిష్టల్లోకి వస్తుందనీ, చినమస్తాను (శ్రీరంజని) విచారము వొప్పించి జనులను రంజింపజేయగలదని, కనాంబాల (కనాందేవి) ప్లేటు సింగరులో బాగాపాడిందని, షరీపా (ఇల్లాదేవి) రంజితువారి 'కాట్' లో బాగా యాక్టుచేసిందని యింకా ఎన్నో విషయాలు చెప్పుండేవాడు. శాంతాయాప్టే గానం అతని చెవుల్లో నాదం జేస్తుండేది. చంద్రమోహన్ నడక, ముంతాజాలీ డాన్సు, బారువా, సుబ్బారావు గార్ల యాక్టింగు నిద్రలోకూడా అతని మనోపథాన్నుంచి తొలగేవి కాదు.

చిన్నతనంలో చమత్ప్రసంధ్యలు చూసిన కాలం ఎంత వ్యర్థప్రయోగం జేసినా ఇప్పుడైనా సినిమా ప్రపంచములో దూకి కళను పెంపొందించాలనే ఆశయం బయలుదేరింది. కళను వృద్ధిపరచే పురుషుల్లో తానొకడవవలె ననుకున్నాడు. ఎంతమంచి ముత్యమైనా సముద్రపు టడుగునపడితే జనులు లెక్కచెయ్యరనుకున్నాడు. శాంతారాముకు వలెనో, బారువాకువలెనో పేరుమోగిన డైరక్టరు కావలెనన్న ఆశయం బయలుదేరింది.

రంగములో దిగట మెలాగ? అతను యాక్టుచేయలేడు. చిన్నప్పుడతని కవకాశం కలుగలేదు. ఇప్పుడు నేర్చుకోవచ్చునంటే— మంచి నటులనే తమ బుద్ధిమాంద్యమువల్ల ఏమీ రానివారిలాగ తయారుజేసే డైరక్టరు— అతని కెవరు నేర్పుతారు? అతనికి మాత్రం తనకున్న శ్రద్ధనుబట్టి ఏపనిలో ప్రవేశించినా కృతార్థుడను కాగలనన్న ధైర్యముంది. అతని సంగతి తెలిసిన కొందరు 'మెడ్రాసువెళ్ళి, ఏస్టూడియోదగ్గరో మకాముపెట్టి అక్కడవున్న టెక్నీషియన్లతో స్నేహముచేస్తే, వారే నేర్పుతారు ఏపనైనా' అన్నారు. 'సరే' నని మోహనరావు మెడ్రాసు ప్రయాణం కట్టాడు.

3

మెడ్రాసులో ఒక స్టూడియో సమీపమున ఒకయిల్లు అద్దెకు తీసుకున్నాడు. క్రమంగా అక్కడ

వున్న షెక్స్పియరులతో నటీనటులతో స్నేహం కలిపాడు. ప్రతిరోజు వారితో వస్తూపోతూ వుండేవాడు. డబ్బుమాత్రము ఖర్చవుతుందిగాని అతని కేమాత్రము మేలు కలగటము లేదు ఈవిధంగా ఆసాగరములోబడి కొట్టుకుంటున్నాడు దరీ అంతూ కనపడక- అతన్ని దరిజేర్చటానికి ఏమహానుభావుడూ పూనుకోలేదు.

అందరితోపాటు రోజా అనేనటితోకూడా అతనికి స్నేహం కలిగింది. ఆమెఎంతోబాగా పాడుతుందని, నటిస్తుందని ఆమెనుజూచి చాలా సంతోషించేవాడు. ఆమెతో తరుచు మాట్లాడటము, అపుడపుడు బహుమతులు పంపటము ఆరంభించాడు. క్రమంగా ఆరోజావువ్వు మోహనభ్రమరాన్ని విశేషంగా ఆకర్షించింది. ప్రేమ అధికమైంది. మోహనుడు ఆమెతో పెండ్లి తలపెట్టాడు. ఈవిధంగా అతడు తను కళను పోషింపలేకపోయినా కళను పోషించేవారికి పోషకుడైనాడు.

తన పెండ్లికి రావలసినదని బంధువులకు స్నేహితులకు ఆహ్వానాలు పంపాడు. పందిట్లో అడుగు పెట్టినవారు ఎవరు లేకపోయారు. రాముడు దగ్గరనుంచి మాత్రము ఆశీర్వదిస్తూ తంతి వచ్చింది.

పెండ్లయిన క్రొత్తలో అందరి నూతనదంపతులకువలెనే వారున్నూ ఎంతో అరమరిక లేకుండా వున్నారు. తాను సినిమాస్టారును పెండ్లి జేసుకొని హిమాన్స్ రాయి అంతవాణ్ణో, లేక ఆ మహారాజా అంతవాణ్ణో ఐనానను కొన్నాడు.

స్టూడియోకు వెళ్ళటము రావటము- ఏహోటలునుంచో భక్ష్యాలు తెప్పించుకొని హాయిగా కాలం గడపటం జరిగేది. ప్రేమవల్ల ఆమె చెప్పినదే వేదవాక్యంక్రింద కనుపించటమువల్ల ఆమె చెప్పినట్లు నడుచుకొంటూవుండేవాడు. కాని అలా ఎంతకాలం గడుస్తుంది?

రానురాను చేతుల్లోవున్న డబ్బు, హృదయంలోవున్న ప్రేమ సన్నగిలింది. కళంటే తనకెంత అభిమానమున్నా తాను హృదయమిచ్చిన స్త్రీ యింకొకనితో కలిసి వుండటము చూస్తే కంట్లో దుమ్ము పడినట్లుండేది. ఏచిన్నపని కావలసినా తనచేతుల్తో చేసుకోవటము, పైగా అపుడపు డామె అధికారగర్వంగా మాట్లాడటము చూస్తే మనస్సుకు బాధగలిగించేది. ముందున్న ఆశ నిరాశఐంది. తెరమీదచూచి మంచి జీవమనుకొని తీరాదగ్గరవుండి పరిశీలిస్తే మేడిపండు పొట్టవిప్పి చూచినట్లు కనిపించింది. దూరాన్నుంచి స్వర్గమనుకొన్నది కాలుబెట్టేసరికి నరకమనిపించింది. పాలను పొంగబోసుకొన్నట్లు తనయావనాన్ని వృధాజేసుకొన్న విషయం తలిస్తే మనస్సులో ఒక పెద్దగాలి

దుమారం బయలుదేరేది. ఈ చింతలో—రేపులు మాపులు రాటపాకుల్లాగ తిరిగి రోజులు నిమిషాల క్రింద గడిచే కాలంపోయి రోజొక సంవత్సరముక్రింద గడుస్తుంది.

కొద్దిరోజులు గడిచాయి. కొంచెము జ్వరమొచ్చింది. మనోచింతవల్ల ప్రబలింది. వంటిమీద వడ్లగింజవేస్తే పేలాపుగింజవుతూంది. దగ్గర ప్రాక్టీసు పెట్టుకున్న డాక్టరు చీటికి మాటికి వచ్చి కంటికి రెప్పవలె కాపాడుతున్నాడు. దగ్గర 'నా' అన్నవాళ్ళెవరు లేకపోవటమువల్ల సంరక్షణ సరిగా జరగటము లేదు. భార్య దగ్గరవుంటుందంటే, 'షూటింగు ఆగిపోతుంది, అధికార్లు వీల్లేదన్నా'రని జబాబుచెప్పింది. రాముడికి వుత్తరం వ్రాయించాడు.

ఉత్తరమందిన తక్షణం రాముడు అంగలార్చుకొంటూ వచ్చాడు. నాలుగురోజులు అడుగు కదలకుండా కనిపెట్టుక వున్నాడు. జ్వరం కొంచెము తగ్గింది తిరుగుమొఖం పట్టిందనుకొన్నాడు. 'మోహనా! ఇంత పట్టుదలగలవాడవు యీ స్త్రీకి లొంగిపోయావు. సినిమాగరళ్సుయొక్క ప్రణయాగ్నిలో బడి ఎంతోమంది యువకులు దగ్ధమయ్యారు. అవబోతున్నారు. అవుతారు. సుందరమైన గుడిలో సుందరమైన విగ్రహముంటుందని తలచావుగాని బంగారు పూతబూసిన సమాధుల్లో పురుగులుంటాయని తలచలేదు. ఆకార మమృతతుల్యమైనా మనస్సు విషతుల్యం. వారి మనోవృత్తికి యెరమై యుండక యికనైనా నాతోరా. ఈవిషాగ్నిని నీవు భరించలేవు. నాకు సెలవైపోయింది. నేను రేపు నిన్ను తీసుక వెళ్లుదామని అనుకుంటున్నాను' అని చెప్పాడు.

చెడి స్నేహితుడింటికి వెళ్ళటానికిష్టము లేక యిక్కడేవుంటానన్నాడు మోహనరావు. మర్నాడు 'అన్నయ్యను జాగ్రత్తగా కనిపెట్టం'డని చెప్పి—'ఆసంగతి నాకు తెలియదూ'అన్న రోజా సమాధానం విని బండెక్కాడు రాముడు.

రాముడు వెళ్ళిపోయిన తరువాత మోహనుడికి జ్వరం తిరిగి రావటం ప్రారంభించింది. మనోచింత మరీ ఎక్కువైంది. ఒకనాడు సాయంకాలము రోజా స్టుడియో నుంచి రావటముతోటే తనకు జ్వరం పూర్తిగా వచ్చిందని, కొంచెము దగ్గర వుండమని అడిగాడు. 'నాకు జ్వరంవచ్చేటట్లుంది నాకు రిక్రియేషను లేకపోతే తప్పకుండా జ్వరం వస్తుంది కాబట్టి క్షమించా'లని వెళ్ళిపోయింది రోజా.

ఆమాట వినేసరికి మోహనునకు గుండె నీరయింది. తనకు ఈ ప్రపంచకానికి యిక సంబంధము లేదనుకున్నాడు. ఉన్న సంబంధాలన్నీ యిదివరకే తెంపేసుకున్నాడు. తన ఆశయం అంతరించింది. ఇక జీవించి సుఖం లేదనుకొని రాముడికి వుత్తరమువ్రాసి లేనిశక్తి తెచ్చుకొని బీచీవైపుకు వెళ్ళి పోయాడు.

విజ్ఞానవిషయాలు

ఇండియా వల్ల

ప్రతి బ్రిటీష్ పౌరుని రాబడిలోని ప్రతి పౌనులోను నాలుగు షిల్లింగుల వంతున ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఇండియానుంచో, ఇండియావల్లనో లభ్యమౌతుంది.

.. ..

పొడుగైన వంతెన

ప్రపంచంలోకి అంతటికీ పొడుగైన వంతెన స్కాట్లండులోవుంది.

... ...

అంగుళం వర్షం

ఒక అంగుళంవర్షంవల్ల పడ్డ నీరు మంచుగా మారితే ఒక అడుగు చతురం గల గడ్డగా ఔతుంది.

... ...

పెద్ద చెట్టు

రోడీషియాలోని విక్టోరియా జలపాతంవద్ద ఒకపెద్ద చెట్టువుంది. దాని మొదలు చుట్టుకొలత 88 అడుగులు.

... ...

శనివారం సగం సెలవు

క్రైస్తవులు చిరకాలంగా శనివారాన్ని సగంసెలవుగా పాటిస్తూవున్నారు. ఆదివారంనాడు చర్చికి పోయేటందుకు తయారై సద్దుకోవడానికిగాను ఈశెలవు ఆదిలో ఉద్దిష్టమైంది.

... ...

సులోచనాలు

కంటి అద్దాలు పదమూడో శతాబ్దిలో ఇటలీదేశస్థుడిచేత కనుగొనబడ్డాయి.

ఆంధ్రరమణీమణులు భా-౧

ఇందు—కాకతీయాంధ్రసామ్రాజ్య సింహాసన మధిరోహించి జనరంజకముగ, శత్రుభయంకరముగ రాజ్యమేలిన రుద్రమ్మ; ధరణికోట సింగపుపీఠి నెక్కి అసామాన్యముగ రాజ్యచక్రము త్రిప్పిన గణపమ్మ; ఆంధ్రదేశమున ఆడుదియై పుట్టిన మంత్రిరాక్షసుని అపరావతారముగా నాయకురాలను బిరుదుగాంచి పలనాటి నాగమ్మ. కౌగిలిలోనున్న భర్తను దీవించి కరవాలమొసగి కదనరంగమునకంపిన మాంచాల; ప్రజారంజకముగ పెద్దాపుర సంస్థానమును పాలించి తురక ఫౌజుదారుని బారి పడకుండ జోహారొనర్చిన అభిమానస్వరూప రాగమ్మ; ఆమె చేతులనుండి ఆమె మనుమని ఏడు మాసముల కసుగందుని గ్రహించి పంచకరపాట్లుపడి అరసి రక్షించిన స్వామిభక్తిపరాయణ మహాలక్ష్మమ్మ; పతియగు రాయజగపతితో సహగమన మొనర్చుచు పతి విరోధియగు ఆనందరాజునకు తిరుగని శాపమిచ్చిన మహాపతివ్రతాతిలకమగు సీతమ్మ; రాణివాసపు స్త్రీలందఱకంటె ముందుగా దాను కత్తికెరయైన మానమెఱిగిన స్త్రీత్వమునకు మొదలిపేరైన బొబ్బిలిరాణి మల్లమ్మ; నిండు చూలాలయ్యు మానసంరక్షణార్థమై నిజప్రాణముల ఖడ్గమున కెరచేసిన రమణమ్మ— వీరలఅద్భుతచరితలు ఆంధ్రాభిమానముతో ప్రస్తరింపబడినవి.

2-వ కూర్పు. 112 పుటలు, దళసరి కాగితములు.
పోస్టుఖర్చులు ప్రత్యేకము. ప్రతి 1-కి అ 8.

ఆంధ్రరమణీమణులు భా-౨

ఇందు—రణరంగమున వీరవిహారము విరమించి యింటికి వచ్చిన పతికి వీరసందేశమిచ్చి తిరిగి కదనభూమికి పంపి ఆతనికి వీరస్వర్గమిప్పించిన ఆంధ్ర వీరపత్ని చానమ్మ- మానముకొఱకు, మాటవాసికొఱకు తన్నుతాను పొడుచుకొని చనిపోయిన తంజాపూరి తెనుగురాణి రాజగోపాలమ్మ- యీ రాజగోపాలమ్మ మనుమని చెంగమలదాసుని విక్రాంతిసమయమున అరసి రక్షించి తన ప్రభుభక్తిని ప్రకటించిన దాది - మధుర ఆంధ్రనాయక రాజ్యపాలనమును మహనీయముగ సాగించి దానవిరతని, ఆంధ్రభాషాభిమానమును అతిశయముగ ప్రకటించిన మంగమ్మ- చాందాసాహేబు మోసమునకు గురియైన మీనాక్షి- పథ్యముముట్టని పచ్చి బాలెంతరాలయ్యు తన సహగమనోద్యోగము నెఱవేరకపోగా పన్నీరు త్రాగి ప్రాణములు విడిచిన పతిప్రాణ ముత్తమ్మ ప్రజోపయోగమునకై శిశుసహితముగ బలిపోయిన సంగమ్మ వీరల పవిత్ర చరిత్రలు గలవు

దళసరి కాగితములు. 100 పుటలు.
పోస్టుఖర్చులు ప్రత్యేకము. ప్రతి 1-కి అ 8.

కేయూరబాహుచరిత్ర

శిల్పము మెరయ మంచనమహాకవి రచియించిన కేయూరబాహుచరిత్ర అను పద్యకావ్యమును ఆధారముగ తీసికొని లేట తెనుగు వచనమున జనసామాన్యమునకొఱకు వ్రాయబడినది. పెండ్లాడినవానిని సార్వభౌమునిగా జేయు వరము నొందిన మృగాంకావళియను నొక రాజకన్యను కేయూరబాహువను రాజునకు నతని ధర్మపత్నినె భాగురాయణుడను నాతని మంత్రి నిజబుద్ధిబలమున వివాహముచేయించిన వృత్తాంతమిందలి ప్రధానకథ. నడుమ నడుమ చక్కని నీతికథలు పెక్కులు గలవు.

గ్లేజు కాగితములు. 90 పుటలు.
పోస్టుఖర్చులు ప్రత్యేకము. ప్రతి 1-కి అ 8.

ఆంధ్రరాజభక్తులు

రాజభక్తి యనునది దేశభక్తికి పర్యాయపదముగా రాణించుచుండిన ఆంధ్రదేశపు స్వతంత్రయుగ చరిత్రలలో రాణించు రాజభక్తశిఖామణులగు విశ్వనాథనాయడు, యాచమనాయుడు, [illegible] రజాక్ లారి, కరిబసవస్వామి, తిక్కన మంత్రి, మహాలక్ష్మమ్మ, పాపారాయుడు, హనుమప్ప నాయుడు అను ఎనమండుగురి చరిత్రలను కీర్తించు గ్రంథము.

గ్లేజు కాగితములు. 112 పుటలు.
పోస్టుఖర్చులు ప్రత్యేకము. ప్రతి 1-కి అ 8.

ఆంధ్రభూమి బుక్కుడిపో, వేపేరి, మదరాసు.

రాజేశ్వరి త్యాగం

[చిన్న కథ.]

ఈ కథలోని రాజేశ్వరి వుండిన పరిస్థితులవంటి పరిస్థితులు ఎందరికో వుండవచ్చు. కాని ఈ రాజేశ్వరి వలె మాయనర్మంలేక వున్నది వున్నట్లు మగనితో చెప్పివేసే మగువలు ఎంతమంది వుంటారు? కోటికి ఒకరు కూడా వుండరేమో!

రచయిత:

కొత్తపల్లి శ్రీరామమూర్తి, యల్.యమ్.ఇ

౧

రాజేశ్వరి కాపరానికి వచ్చి సుమారు రెండు సంవత్సరాలు పైబడింది. పెళ్ళినాటికి పదిహేనేళ్లు వుంటా[illegible] కోటీశ్వ[illegible]ల్ల ఆమె కో[illegible] [illegible] సే [illegible] [illegible] చూచిన కొద్దీ నాకు ఆమెయందు జాలి, అనురాగం పెరిగేవి.

కాని ఆమెను ఆకర్షించగల గుణాలేమీ నాలో లేవు. ఆమె సరదాలు తీర్చడానికి నేను సరదామని పిసినను దానికి కారణం నా బీద తనమే అయి వుండవచ్చు లేమో.

నేను రూపవంతుణ్ణి కానని నాకు తెలుసు. రూపం లేకపోయి నా మంచిగుణాలన్నా వున్నాయా అంటే అవికూడా పూజ్యం. అది గాక ఏవి మంచిగుణాలో నాకు తెలియను నాకు మంచిగుణాలుగా కనిపించేవి ఆమెకు నచ్చకపోవచ్చు. కాని మొత్తంమీద ఆమె హృదయాన్ని రజిప[illegible] చేయలేక [illegible]

[illegible]జేశ్వరి [illegible]మైన త్[illegible] [illegible]. ఆమె [illegible] [illegible]దనేశ్వరి అయింది. కాని ఆమెను ఆకర్షించలేకపోయాంపురా వెర్రివాడా అని నాహృదయము మాత్రము నాకు తట్టి చెప్పుతోవుండేది.

[illegible]లో [illegible] [illegible] నాకు తెలియ[illegible] [illegible] జన్మలో తీరేదికాదు.

ఆమె చక్కని చీరకట్టుకున్నా, పువ్వులు పెట్టుకున్నా ఆరోజు ఆమెను విడిచి బయటకి వెళ్ళాలని కూడా అనిపించేదికాదు. అశాశ్వతమైన జీవితంలో అంతకన్నా సుఖమయమైన ఘడియలు వేరే లేవనిపించేది. ఆమె ప్రేమను పొందడానికి నేనుపడిన శ్రమ ఆ పరమాత్మునికే ఎరుక. కాని ఆమె హృదయ మంత పాషాణంలా వుండటానికి కారణం ఏమిటా అన్న ఆలోచన నాలో అప్పటప్పట తుపాను రేపేది. దానికి తాళుకోలేక సుడిగాల్లో తగులుకున్న ఎండుటాకులాగున నామనస్సు గిర్రున తిరిగిపోయేది. దారి తెలిసేదికాదు.

ఆమెలో సర్వము, నన్నాకర్షించాయి. కాని నేను ఆమెను ఆకర్షింపలేకపోయాను. ఆమె మనస్సు యింకెక్కడో వున్నట్టు తోచేది ఆమెరుపు దెబ్బకి తాళుకోలేక పోయేవాణ్ణి. ఆమెకు నాచేష్ట లేవీ తృప్తికరంగా వుండేవి కావు.

౨

[illegible] [illegible] వెసంగి [illegible] [illegible] [illegible] వుంది [illegible]మీద నా రాజేశ్వరి, నేను పండుకొని వున్నాము వెన్నెల పిండి ఆరబోసినట్టు చక్కగా వుంది.

నాకు నిద్రపట్టడంలేదు. నాయిల్లాలి [illegible] నేపండుకుంది. చం[illegible] [illegible]లు ఆమె ముఖంమీద [illegible] ప్రసరిస్తున్నాయి.

ఇక నా ఉద్రేకం ఆగలేదు. ఆమెను గట్టిగా ముద్దుపెట్టుకున్నాను. నా వేడిపెదవులు ఆమె పెదవులకు తగలగానే సరోజాల్లాంటి

ఆమె కన్నులువిప్పి చల్లని చూపులు ప్రసరించింది. మెల్లగా ఆమె ముంగురులు దువ్వుతూ యిలా అన్నను. 'ఏం? రాజ్యం! నేనంటే యింత అలసత్వానికి కారణం చెప్పవూ?' అని గడ్డం పట్టి బ్రతిమలాడాను

'ఎందుకు అడుగుతావు, బావా! అసంగతి' అంది బహు కష్టం మీద.

'అలాకాదు చెప్పాలి లేకపోతే నేను...'

'ఎంతమాట! బావా! యీ శరీరానికి ఈశోభ కూడా లేకండా చేదామనా నీతలపు' అంది.

'అయితే నీ ఆత్మకి ఆనందం లేదా?' అన్నా.

'లేదు! ఆత్మా, శరీరం ఒకని పరం చేయకండా చేశారు నాతల్లిదండ్రులు ఈభౌతిక శరీరాన్ని నీకు ధారపోశారు. అది నీ యిచ్చవచ్చినట్లు ఉపయోగించుకో. కాని హృదయము నాకు తెలియకండానే ఒకని పరమై పోయింది. అది తిరిగి నా అధీనంలోకి వస్తుందన్న ఆశ యిప్పట్లో లేదు బావా! అదివస్తేనూత్రం నీ అధీనంచేస్తా. ఇట్లా అని నీమనస్సుకి కష్టంకలిగించినందుకు క్షమించు.'

ఆమె మాటలకు నాలో ఈర్ష్య. క్రోధము, జాలి కుమ్ములాడసాగాయి. కాని ఆమె అకల్మషమైన మాటలకు నా ఆత్మ సంతోషించింది. శరీరం కోపించింది. తుదకు జాలే జయం పొందింది.

'అయితే రాజేశ్వరీ నీహృదయాన్ని దొంగిలించిన దుర్మార్గుడెవడు' అన్నాను.

'బావా! నన్ను ఆక్షేపించకు. నాకు కోపంవస్తోంది' అంది

ఆమాటంతో నాలో మొలకెత్తిన కోపం పూర్తిగా నశించింది.

'లేదు, యీశ్వరి! ఆడదానికి తనముందు యితర ఆడవాళ్ళను పొగిడితే ఎంత పౌరుషం, కోపం వస్తుందో అలాగే మగవాడికి కూడా తనతో పోటీదారుడు వున్నాడంటే అపరిమితమైన క్రోధం, ఈర్ష్య రావడంకూడా సహజంకదూ! అవి జయించినవాడే మనిషిసుమా' అన్నా పెద్ద వేదాంతిలాగ.

ఆడదానికి కోపం తెప్పించాలంటే దానిదగ్గర మరో ఆడదాన్ని గురించి పొగడటమే సాధనం. అప్పుడే ఆమె నిజస్వరూపం గోచరమౌతుంది.

ఒకనాడు మా రాజ్యంతో మాటవరసకు నాతో చదువుకున్న ఒక అమ్మాయిని గురించి చాలా బాగుంటుందని, సుశీల అని, చురుకైందని ఏవేవో కోశాను ఆమాటతో తనకన్నా ఆమె అధికురాలేమో అని ఉడుక్కుంది రాజ్యం. ఆవేళ ఆమె ముఖం ఎంతో ముద్దువచ్చింది నాకంటికి. వుడుకుమోత్తనంతో ఆమె ఆనాడు అన్నమాటలు అతి మధురంగా వున్నాయి.

అలుకున్న అమ్మకి ఉలుకెక్కువ అన్నట్టు ఆనాడు దాన్ని అలా ఉడికించినందుకు నన్నిలా ఈనాడు ఏడిపిస్తోందేమో అనుకున్నాను. కాని ఆమెలో ఏకోశానా వెటకారం కనుపించలేదు. దాంతో నాగుండె జారిపోయింది

'అయితే ఆమనిషి ఎవరో చెబితేకాని వీలులే'దని బలవంతంచేశాను.

ఆమె నా మోడిపట్టుకి లొంగిపోయి యిట్లా చెప్పసాగింది.

3

'బావా! నాజీవితం పిడుగుపడిన తాడివంటిది పైకి ఏదో మానవాకృతిలోవుంది కాని లోపల నా గుండె చితికిపోయింది. మా చిన్నత్తయ్య కొడుకు రాముం. నీకూ తెలుసు. అతడు వాళ్ళ అమ్మమ్మ దగ్గరే పెరిగాడు అంటే మాయింట్లోనే వుండేవాడు. చిన్నతనంనుంచి నేను అతను కలసి చదువుకుంటూ వుండేవాళ్ళం.

బొమ్మలపెళ్ళిళ్ళు ఆడుకుంటే కూడా యిద్దరం భార్యాభర్తలుగా వుండేవాళ్ళం.

అతడు ఆవకాయముద్దా, అన్నం కలిపి నానోట్లో పెడితే-నేను పప్పుపులుసూ అన్నం అతనినోట్లో పెట్టేదాన్ని బాల్యంలో ఒక కంచాన తిని, ఒక మంచాన పడుకునేవాళ్ళం. మా అమ్మమ్మ మమ్మల నిద్దరనుచూచి చిలకా గోరంకలా

మా బాగున్నారు అని మురిసిపోయేది.

నాకు కొంచం ఊహవచ్చేక, అంటే పెళ్లాం మొగుడు అనే విషయం అంటే ఏమిటో తెలిసాక అస్తమానూ అతన్ని అంటిపెట్టుకునే వుండాలనిపించేది.

అప్పటికి నాకు పదమూడోయేడు వచ్చింది. ఆసంవత్సరం విధివశంచేత రామం యింటరుపరీక్షలో గుడ్డుపెట్టాడు. అందుతో మా బాబయ్యకి అతనిమీద అసహ్యం పుట్టింది.

ఈసందు కనిపెట్టి మా అమ్మ మరో యింధనం వేసింది అతని కోపానలంలో. వీళ్ళిద్దరూ కోతుల్లా ఎగురుతూ చదువు సంధ్యలు మానుకున్నాడు, మీ అల్లారు ముద్దుల అల్లుడు. మొద్దయ్యాడు చూసారా అని సాగతీసుకంటో చెప్పడం మొదలు పెట్టింది. మాఅమ్మ పోరుపడలేక రామం యిక కాకినాడలో చదివితే గట్టెక్కడేమో అని అతన్ని రాజమంద్రీ పంపించేశాడు మా పెద్దఅన్నవద్దకి.

అమ్మాయి పెద్దమనిషి అయిపోతుంది మా అన్నగారి అబ్బాయికి యిచ్చి యీసంవత్సరం ఆమాఘమాల్లో వేయించేయండని పోరింది మాఅమ్మ. మానాన్న మా ప్రేమ కొంచెం గ్రహించినవాడు కనుక రామానికి యిద్దాం అన్నాడు. ససేమిరా అంది మా అమ్మ.

మా ప్రేమగాథ అంతా ఎరిగి వున్న మాతల్లి అతన్ని అవతలకు పంపించి యీఎత్తు ఎందుకు ఎత్తిందో నేను చెప్పలేను. కాని నేను మీ అధీనమైనాను. నాహృదయం అతని అధీనంలోవుంది. ఇది నాకథ. అతన్ని మరచిపోదామనుకుంటాను. కాని అతని మృదువైన మాటలు నా చెవులలో గింగిరులు పెడుతున్నాయి. అవి నాహృదయంలో గాఢంగా నాటుకున్నాయి- నాచిన్న హృదయంలో యింక యితరములకు స్థానంలేదు. అందుచేతనే మీ అనురాగమునకు తగిన ప్రతిఫలం మీకు పొందలేక పోతున్నారు.

అయితే ఎందుకు జీవిస్తున్నావు అనిగాని, లేక అతనితో ఎందుకు లేచిపోలేదని కాని అడుగుతారేమో? ఆత్మహత్య మహాపాపమని పూర్తిగా విశ్వసిస్తాను. అదీకాక కన్నతల్లి లోకమాత అని, తల్లికన్న వేరు దైవములేదని కదా అంటారు- అందుకు యీ శరీరం ఆమెది కనుక, ఆమె యిష్టంవచ్చినట్టు చేసుకొనుటకు ఆమెకు అధికారంవుంది కనుక ఆమె యిచ్చ నెరవేర్చాను.

రెండవది ఒకరుగిల్లి వాసన చూచిన వెనుక పువ్వు యితరులకు పనికివస్తుందా?

నామనస్తత్వము తెలుసుకోకుండా నన్ను పరిగ్రహించినందుకు మీకు సేవచేయుడమే నావిధ్యుక్తధర్మము. ఈత్యాగం చేయడానికి సంకల్పించుకున్నా మా అమ్మ ఆజ్ఞప్రకారం- ప్రేమ అకల్మషమైనది కనుక-అది శరీరవాంఛలకు అతీతం కనుక నా ప్రేమ వృక్షమును నిర్మూలించకుండా పెంచుకున్నాను దానికి ఎన్నటికి చావు లేదు. దాని చెంతకుజేరినవారి కందరకు అది ఆశ్రయమిస్తూనే వుంటుంది '

ఈగాథ అంతా నిర్ఘాంతపోయి వింటూవున్నాను స్త్రీ హృదయము అగాధమని పెద్దలు వూరికే చెప్పారా అనిపించింది.

కాని నారాజ్యం నిజంచెప్పినందుకు నాహృదయం ఉప్పొంగి పోయింది.

గుడ్డి, చెవిటి లాభాలు

గుడ్డివాడై మిల్టన్ ఆంగ్లమహాకవి ఐనాడు.

గుడ్డితనం పైబడ్డాకనే మన చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు తెనుగులో మంచి పుస్తకాలు వ్రాశారు.

ఇట్లా గుడ్డితనం లాగునే చెముడు కూడా కొందరికి లాభిస్తుంది.

థామస్ ఆల్వా ఎడిసన్ చెవిటివాడు కావడంచేతనే అనేక శాస్త్రపరిశోధనలు చేయగలిగాడు.

మన గిడుగు రామమూర్తి పంతులుగారి అసాధారణజ్ఞాపకశక్తికి చెముడే కారణం.

బ్రహ్మచార్లముఠా

[చిన్న కథ]

బ్రహ్మచార్లకు పూర్వం వాలఘాటు పిల్లల ప్రమేయమే ప్రాయకంగా వుండేది. ఇప్పుడు సినీమాల మూలకంగా కొత్తరీతి పిల్లల ప్రమేయంకూడా ఏర్పడి వుండడం ఈకథ ప్రస్తావిస్తూవుంది. స్త్రీసాహచర్యంకోసం లొట్టలువేస్తూంటే బ్రహ్మచారుల మనోగతభావాల్ని ఈకథ చక్కగా రూపిస్తూవుంది. దృక్దూతికల ద్వారా తాము స్త్రీలను ఆకర్షించవచ్చు. కాని తమ స్వాధీనంలోకివచ్చే స్త్రీ ఇతర పురుషులకు దృక్దూతికల్ని పంపుతుందేమో అని బ్రహ్మచారుల భయం. —సంపాదకుడు.

రచయిత:

పురాణం కుమారరాఘవశాస్త్రి, బి.యే.

రామేశం (రామారావన్నపేరు అలాగ పరిణామం పొందిందిలెండి) ఈమధ్య కొన్నాళ్ళొక పుస్తకాల షాపు తరఫున ట్రావెలింగు ఏజెంటుగా పనిచేశాడు. ఆ అవకాశం తీసుకుని చాలాఊళ్ళు తిరిగివచ్చాడు సైగల్, కె. సి. డే మొదలైనవారి హిందూస్తానీ కీర్తనలు చక్కగా అనుకరించి పాడగలిగినందువల్లా— కొంతవరకు నాటకానుభవంకూడా కలిగినవాడు కావటంచేతనూ— అక్కడక్కడ కొన్ని పరిచయాలు ఏర్పాటుచేసుకొచ్చాడు ముందు ముందెన్నడేనా పనికిరాక పోతాయా అని.

ట్రావెలింగులో తన అనుభవాలన్నీ చక్కగా నోరూరేలాగు వర్ణించి చెబుతున్నాడు రామేశం. రాజోలు తాలూకాలోని ఒక గ్రామంలో తానొక చక్కని పదహారేండ్ల అమ్మాయిని చూడ్డం తటస్థించిందిట.

వయసు వినగానే పిలకశాస్త్రికి ఒళ్లు పులకరించి రామేశానికి దగ్గరసా జరిగి శ్రవణోత్సుకుడైనాడు.

ఆ పిల్ల బాలవితంతువుట.

'పాపం' అన్నాడుశాస్త్రి.

'చిన్నపిల్లకదా ? మళ్ళీ పెళ్ళి ఎందుకు చేయలేదో!' విశ్వనాథానికి ధర్మసందేహం కలిగింది.

రామేశంచెప్పాడు : 'వాళ్ళది చాల బీదకుటుంబం. అదుకునే చుట్టాలబలగంకూడా తక్కువే. రోజు గడిస్తే యేడుగడచినట్టుగా—అంత దీనపరిస్థితుల్లో ఉన్నారు. ఈ సంగతులన్నీ నాకా పిల్ల మేనమామవల్ల తెలిసినై. అతనికీ, నాకూ మొదట కాఫీహోటలులో పరిచయంకలిగింది. తరువాత నన్నింటికి తీసుకుపోయి నాపాట విన్నాడు. మాటలసందర్భంలో నేను కొద్దిరోజుల్లో సినీమాలోకూడా వేషం వేయబోతున్నాననీ, చాలమంది డైరెక్టర్లు నాకు తెలిసినవారేననీ బడాయిలు దంచేశాను. అతడు నన్నొక మహానటుణ్ణిగానూ, సినీమాప్రపంచంలో చాలవరకు పలుకుబడి కలవాణ్ణిగానూ భావించి ఉంటాడు. బాధ్యత వహించేట్లయితే తన మేనకోడల్ని తీసికెళ్ళి పాటా, అభినయం నేర్పుకుని సినీమాల్లో వేషాలు వేయించగలరా అని అడిగాడు. 'ఓ, అదెంత పనండీ' అని మళ్ళీ చెప్పానుకదా : 'బెజవాడ వెళ్ళి నాస్నేహితులతోకూడా ఆలోచించి ఉత్తరంరాస్తాలెండి' అని చెప్పి వచ్చాను.

'వెంటనే మన రామేశం ఆ అనాథబాలికను పిలిపించుకుని, పెండ్లాడి, ఒక పాడుపడ్డ దేవాలయాన్ని పునరుద్ధరించినంత పుణ్యాం కట్టుకోవటమే నా అభిమతం' అన్నాడు విశ్వనాథం.

'ఔను, నేనూ అదే చెప్పాలనుకుంటున్నాను' అన్నాడు పిలకశాస్త్రి.

'కాని అబ్బాయిలూ! నాకు పెండ్లిమీద సరదా లేదోయ్ మునుపటిలాగ. ట్రావెలింగులో ఉన్నప్పుడు వివేకానందుడి జీవిత చరిత్ర చదవటం సంభవించింది. చదివిన తర్వాత నా మనస్సు మారిపోయింది. కామాన్ని జయించి నేను కూడా అలాగే ఆజన్మబ్రహ్మచారిగా ఉండాలని నిశ్చయం చేసుకున్నాను. కనుక పాపం తల్లిదండ్రులకుకూడా బరువైన ఆపిల్లను తీసుకొచ్చి, చదువూ అదీ చెప్పించి, మనస్సుకు వికాసం కల్పించి, ఆధ్యాత్మికంగా పైకి తీసుకురావాలని సంకల్పించాను. ఏమంటారు?'

ఆ నిగ్రహబుద్ధికీ, పరోపకార దీక్షకూ ముగ్ధుడై చూస్తున్నాడు విశ్వనాథం.

పిలకశాస్త్రిమాత్రం ఒక సాపు గంట పకపకా నవ్వి 'జై శ్రీఅపర వివేకానందస్వాములవారికీ జై' అని కేక వేశాడు.

నేను—మన రామేశానికి ఈ చిన్న వయసులోనే ఇంత నిగ్రహం కలగట మనేది చాల ప్రశంసించతగిన విషయం. గాంధి వంటి మహాత్ముడుకూడా సంసారసుఖం అనుభవించి, బిడ్డల్నికని, చివరకు బ్రహ్మచర్యవ్రతం అవలంబించాడు.

శాస్త్రి—కాని మన రామేశానికి శంకరాచార్యులు వివేకానందుడు, ఆంజనేయులు మొదలైనవాళ్ళ 'లిస్టు'లో చేరదామని కదూ ఉద్దేశం!

నేను—మనవాడు ఏ లంబాడిపిల్ల కనిపించినా గంటన్నర చూచే రకం. ఈయన బ్రహ్మచర్యవ్రతం తుద వెళ్ళగలడనే నమ్మకం నాకు లేదు. కాబట్టి వివాహమాడి, పిల్లల్నికంటూనే వసిష్ఠుడిలాగ బ్రహ్మచారి అనిపించుకోటానికి ప్రయత్నిస్తే బాగుంటుందని అతనిమేలు కోరినవాణ్ణి కనుక సలహా యిస్తున్నాను.

శాస్త్రి—సరేలే. నువ్వు మరీ కష్టమైనపని చెప్పావు. 'నాతిగల బ్రహ్మచర్యము నాతరమూ పూటగడప' అని పెద్దలు ఎంత అనుభవంమీద చెప్పారు!

నేను—మనం ఇన్నివిధాల తర్కించుకుంటున్నాం కాని రామేశం ఉద్దేశం వేరేమో అసలు. 'నాకు పెండ్లిమీద సరదా లేదోయ్' అన్న ఆయనమాటకు 'నాకు అతిశీఘ్రంగా పెండ్లాడాలని ఉందోహో' అని కాదు కదా 'విధి నిషేధరూపంబు భావించియున్న- విధియ యగు వ్యంగ్యవాసనా విలసనమున' అన్నట్టు!

శాస్త్రి—ఔను. అదిన్నీ ఆలోచించవలసిన విషయమే. ఏమి, రామేశం? అంతేనా?

నవ్వు

నవ్వు మానవుని స్వాతంత్ర్యప్రకటనకు చిహ్నము. తన కష్టాలకు తాను దాసుడనుకానని మానవుడుచేసే సుందర సూచన నవ్వు.

—*Callisthenes*

ఈప్రపంచంలో మానవుడు తప్ప మరి ఏజంతువు కాని నవ్వలేదు

ముత్యాలు, వజ్రాలు కళ్లు మిరుమిట్లు గొల్పేటట్లు ప్రకాశించవచ్చు. కాని నవ్వేటప్పుడు మానవుని కళ్ళల్లో కనిపించే ప్రకాశంలోని దివ్యత ఆ రాళ్ళకాంతిలో లేదు.

పుష్పాలు నవ్వలేవు. నవ్వులేనిదే అలంకారం వానికి లేదు

అది మానవుని జన్మహక్కు. ప్రేమభావం ధరించే రంగు అది.

ముఖంఅనే గవాక్షంలోని వెలుతురు అది. ఆగవాక్షంద్వారా హృదయం తన ఆనందాన్ని, ఆమోదాన్ని తెలుపుతుంది.

నవ్వలేని మొగం వికసింపలేక తొడిమలోనే ఎండిపోయిన మొగ్గవంటిది.

హాసము పగటివంటిది. గంభీరత రాత్రివంటిది. చిరుహాసము ఆరెంటిని అనుసంధించే ఉషఃకాలమువంటిది.

—*Henry Ward Beecher*

రామే—అబ్బాయిలూ! మీరెంతేనా వేళాకోళం చేయండి. నాకు కోపంలేదు. నావంటి ఉత్తమాశయాలు కలవాళ్లు మీలాంటి తుచ్ఛుల పరిహాసానికి పాత్రులవటం లోకం తరహా. విజ్ఞానంఇచ్చి ఒక అనాధబాలిక జీవితానికి వికాసం కల్పించాలనే నాసంకల్పం చెదరదు. అందుకు మిమ్మల్ని నేను కోరేదేమంటే—ఆ పిల్ల నిక్కడికి రప్పించిన తర్వాత విశ్వనాథం హిందీ నేర్పాలి, శాస్త్రి సంస్కృతాంధ్ర గ్రంథాల్ని చదివించాలి. నేను సంగీతం నేర్పుతా ననుకోండి. [నావేపుచూచి] మరి నువ్వేం నేర్పుతావు?

శాస్త్రి—ఆవిడ ఏ అర్ధరాత్రప్పుడో గుడిసెమీద దెబ్బతీసి లేచిపోకుండా ఆయన వేదాంతం నేర్పుతాడు.

నేను—పోనీ నా వేదాంతం అలాగ ఉపయోగపడ్డా కొంతవరకు సంతోషమే. కాని ఆపిల్లను రప్పించితే మనకు కలిగే లాభాలూ, నష్టాలూ ఒకసారి లెక్కవేసుకుందాం మొదట.

శాస్త్రి—ముఖ్యంగా మనకు హోటలుభోజనం తప్పుతుంది.

నేను—కాని 'కౌపీన రక్షణార్థమయం పటాటోపః' అన్నట్టు ఆమె మూలంగా లేనిపోని సంసారపుగొడవంతా నెత్తిన చుట్టుకుంటుందేమో మనకు?

విశ్వం—అది అలావుండగా, మనం వెయ్యేండ్ల పూజారులం. ఆమెకు కాపలాకాస్తూ ఇంట్లో కూచోము. ఊళ్ళో రౌడీమూక కావలసినంత. ఒక వయసుపిల్ల ఇక్కడ ఉన్నట్టు పసిపట్టారంటే—

శాస్త్రి—నీ పిరికిమాటలు మానెయ్యవోయి విస్సయ్యా! వీళ్ళ

పెళ్ళి - పెద్దల సుద్దులు

పెళ్ళాడిన మరుక్షణంనుంచీ స్త్రీ చిత్తవృత్తిలో చిత్రమైన పరివర్తనం వస్తుంది. ఆమె మంచిగుణాలన్నీ మాయమైపోతాయి.

—*Buller*

స్త్రీపురుషుల నడుమ జరిగే సంయోగాన్ని న్యాయసమ్మతమొనర్చేది పెళ్ళి.

—*M. Arlen*

పెళ్ళి అనేది పంజరంవంటిది. బయటవున్నవారికి లోపలికి దూరాలని వుంటుంది. లోపల వున్నవారికి బయటపడాలని వుంటుంది.

—*Montaigna*

చెందరాలే ప్రేమించి అలస్యంగా పెళ్ళిచేసుకోవడం అనేది భరతపక్షి సంగీతాన్ని పొద్దున్నేవిని దానిని రాత్రి కూరవండుకు తిన్నట్లుగా వుంటుంది.

—*Richter*

పెళ్ళి కత్తెరవంటిది. విడిపోవడానికి వీలులేకుండా కత్తెరలో రెండు కాడలు బంధింపబడి వుంటాయి. ఆ కాడలు తరుచు ఒకదానికి ఒకటి పెడ తోలుగుతూ వుంటాయి. కాని వాటినడుమకు వచ్చే ప్రతి వస్తువుని అవి కత్తిరించివేస్తూ వుంటాయి.

—*Sydney Smith*

బాలానామ్ రోదనమ్ బలమ్

చిన్న ఊపిరితిత్తుల్ని పెద్దవిగా చేయడానికిన్నీ, సన్నగా పలికే కంఠాల్ని బిగ్గరా పలికే కంఠాలుగా చేయడానికిన్నీ ప్రకృతిమాత చిన్నబిడ్డలు తరుచు ఏడ్చేటట్లుగా చేస్తుంది.

చిన్నబిడ్డలు అకారణంగా దినదినమూ అప్పుడప్పుడు ఏడుస్తూ వుంటారు. వారి ఊపిరితిత్తులు, కంఠము దృఢపడడానికి ప్రకృతిమాత వారికి ఉపదేశించిన దేహపరిశ్రమ అది.

అయితే ఏడవడం మొదలుపెట్టగానే తల్లి పరుగెత్తుకువచ్చి ఊరుకోపెట్టడానికి ఏదో లంచం ఇచ్చి లాలిస్తే బిడ్డలకు లంచగొండితనం బాగా అలవాటు అవుతుంది. అప్పటినుంచి లంచంకోసం చీటికి మాటిక ఏడుపు మొదలు పెడతారు.

దేహపరిశ్రమగానూ, లంచాలు పొందేటందుకున్నూ మాత్రమే కాకుండా పిల్లలు పెద్ద చప్పుడు విన్నప్పుడు, కిందపడతామేమో అనే భయం వేసినప్పుడు, ఇంకా యీరీతి భయాలు వేసినప్పుడు ఏడుస్తారు.

ఏమైనా చిన్నపిల్లలు ఏడవడం అవసరం.

అట్లా అని వారు పోరుపడితే మాట్లాడక ఊరుకోకూడదు. డాక్టరుకు చూపించి కారణం కనుక్కొని తగు చికిత్స చేయాలి.

రౌడీతనం, గాడీతనం నా ముందు పనికిరాదు.

నేను—ఔను. మనవాడి వీరత్వం లోకవిశ్రుతమైనదే. పిలక ఝాడించాడంటే వాళ్ళంతా పదిమైళ్ళు పారిపోతారు. కాని ఆ అమ్మాయికే అపరబుద్ధి పుడితే? మనం ఇంటలేనప్పుడు ఆమె కిటికీవద్ద కూచుని వీధిన పోయే యువకులకు దృక్-దూతికలతో ప్రణయ సందేశాల్ని పంపుతూంటుందేమో?

శాస్త్రి—అందుకేగా నీ వేదాంతాన్ని సహాయం అడుగుతున్నాం. అయినా మనం వెర్రిపుల్లాయలం కాదుగదా!

విశ్వ—అంటే మన శాస్త్రిలవారికి ఆ అమ్మాయిని తప్పకుండా పిలిపించాలనే ఉబలాటంగా ఉన్నట్టుంది.

శాస్త్రి— తప్పకుండా పిలిపించవచ్చు. ఏమీ పరవాలేదు.

చివరకు పిలకశాస్త్రిగారి బలవంతంమీదనే రామారావు ఆపిల్ల మేనమామకు ఉత్తరంరాశాడు. వెంటనే పిల్లను పంపించమనీ, చక్కగా సంగీతం సాహిత్యం నేర్పించి సినీమా ప్రపంచంలో ప్రవేశ పెడతాననీ, ఏనాడు ఏరైల్లో పంపించేదీ ముందుగా ఉత్తరం రాయమనీ.

ఉత్తరం పిలకశాస్త్రి స్వయంగా పోస్టులో వేసి వచ్చాడు.

జవా బెప్పుడు వస్తుందా అని ఉవ్విళ్లూరుతూ క్షణం యుగంగా గడుపుతున్నాడు శాస్త్రి. ఆ అమ్మాయి వచ్చేలోపుగానే పెద్ద యిల్లొకటి వేరే అద్దెకు తీసుకుని, బియ్యం నెయ్యి వగైరా సామానులన్నీ తెచ్చి పడేయాలని కూడా ఆలోచించాడు. కాని ఆపనులన్నీ ఆవిడ వచ్చినతర్వాతనే చేయవచ్చు, తొందరపడటం దేనికని మేము హితోపదేశం చేసినతర్వాత శాంతించాడు.

చివర కాపిల్ల మేనమామ జవాబు రాశాడు. వెయ్యిరూపాయలు-రామారావుగారు స్నేహితులు కాబట్టి ఆఖరుబేరం ఎనిమిదివందలయినాసరే వెంటనే పంపించేట్టయితే పిల్లను మావశం చేస్తాననీ, తరువాత ఆమె సినీమాల్లో వేషం వేసేటప్పుడు మాకు వచ్చే లాభంలో ఏమీ అడగననీ, డబ్బుకోసం ఎదురు చూస్తూంటా ననీ రాశాడు.

ఎక్కడ తెస్తాం అంతసొమ్ము! ఆశ వదలుకోవలసి వచ్చింది. మాకేమంత అనిపించలేదుగాని శాస్త్రిణఃమాత్రం చాల విచారించాడు.

* * *

మన కిక పెండ్లి కాదేమో అని దిగులుపడుతూండే వాళ్ళకు పాల ఘాటు అయ్యర్లు వధువులను అమ్మి కొంత దేశసేవచేస్తూ ఉన్నారు. ఇప్పుడు కొత్తగా సినీమాల్లో వేషాలు వేసేందుకుగాను ఆడపిల్లలను అమ్ముకోవటంకూడా అమలులోకి వచ్చేలా ఉంది.

'వెలుగులో నేను'

ఒకమహాజ్యోతి ఆవరించుకొనినన్ను
ఒక నవాలోకమునకు తీసుకొనిపోయె,
కాంచినాడ నానంద సౌఖ్యాల నచట,
కాంచినాడను సౌందర్య కాంతు లచట,
అచటివారలు సౌందర్య మనుభవించి
పూజచేతురు దానినెప్పుడునుకూడ,
అచటివారలతో మాటలాడినాను-
అచటివారల ఆతిధ్య మందినాను-
ఎల్లకాలమ్ము నే నచ్చటే వసింప
కోర్కె జనియించె;
ఎటులు నాకోర్కె తీరు!
ఈ అవని నన్ను వీడునే, ఎన్నడైన?

—పన్యాల వేంకటరంగనాధరావు.

ఒంటె తనముక్కుశోణాలను విప్పార్చుకుంటుంది· కుంచించుకుంటుంది.

ఎడారి ఓడ ఒంటె

అరబ్బుదేశీయుల పాయని బంటు ఒంటె—

కొన్ని ఒంటెలకు రెండు మూపురాలు—

కొన్ని ఒంటెలు నీటిలో ఈదగలవు—

శీతల ప్రదేశాల్లోకూడా ఒంటెలు వుంటాయి—

ఒక్కసారిగా ఒంటి 15 గాలన్ల నీటిని తాగగలదు—

ఒంటె అనడంతోటే దాని మూపురం జ్ఞాపకం వస్తుంది-

కాని ఒంటెయొక్క అస్థిపంజరాన్ని సూక్ష్మంగా పరిశీలిస్తే మూపురం వున్నజాడ ఏమీ కనుపించదు. ఒకటే కనుపించడంలేదంటే ఒంటెకు రెండు మూపురాలున్నాయి అంటే మీరు నమ్ముతారా?

కాని వొంటెకు రెండు మూపురాలున్నాయి-

... ...

ఒంటెలు విచారకరంగా వుంటాయనే మాట సత్యదూరమైంది.

అంతేకాదు. వొంటె కళ్ళంట ఎప్పుడూ నీరు కారుతుందని, నాలుగు పెద్ద ముక్కుశోణాలు వుంటాయని, అవి ఎప్పుడు అదురుతూనే వుంటాయని, తొట్రి పెదవులు వుంటాయని, అందువల్లనే దాని అరుపు సరిగా వినిపించదని కొన్ని అపోహలున్నాయి.

ఇవి సత్యదూరాలని చెప్పవలసి వస్తుంది.

దాని అరపు బేండువాద్యంలా వుంటుంది.

... ...

ఉద్రిక్తమైన ఒంటెలు పది ఒకచోట చేరితే అక్కడ జరిగే ఆర్భాటం అంతా యింతా కాదు. ఆ కుమ్ములాటను తీర్చడం ఎవరితరం కాదు.

... ...

ఒకమూపురంతో పుడుతుంది ఒంటెపిల్ల. పుట్టగానే ఆపిల్ల యితరజంతువులపిల్లలాగ అరవదు. ఇది చిత్రమైన విషయం. కాని తల్లిపడే ప్రసవవేదన అద్వితీయం. మూలుగుతుంది, అరుస్తుంది, బుసకొడుతుంది- బిడ్డబయటపడేవరకు. సర్వసాధారణంగా ఏకాంతప్రదేశంలోగాని వొంటె యీనదు.

... ...

ప్రకృతి ఆ జంతువును ఎడారి జీవిగా నిర్ణయించింది. కాబట్టే పుట్టుకలోనే మోకాళ్లు, చట్టలు బలిష్టంగా ఏర్పడి వుంటాయి.

ఎడారిజీవితానికి సరిపోయినట్టుగానే దాని డెక్కలు చీలి వుంటాయి ఒంటెబొచ్చు మెత్తగా, దూగరిగా వుంటుంది. దానితల గుండ్రంగా వుంటుంది. నిర్మలమైనవి, పెద్దవి, గుండ్రనివి- రెండుకండ్లు ఆకర్షణీయంగా వుంటాయి.

... ...

చిన్నతనంలో దాని అరుపు కటువుగా వుండదు. కాని వయసు ముదిరేసరికి ఆకోమలత్వం అంతరించి అసలు అందం బయటపడుతుంది. దాని అరపు అసహ్యంగా మారుతుంది. బక్కపలాచనితనం పోయి ప్రూబశరీరంతయారౌతుంది.

చిన్నతనమునందలి అంద చందముపోయి వయసుముదరిన కొద్దీ ఆకారమే మారిపోతుంది. ఆకారంతోపాటు దాని జీవనంకూడా మారిపోతుంది- దాని జీవితం ఉత్సాహకరంగా కనిపించదు. యితరుల సౌకర్యమునకు బలి పశువుగా నియమించాడు విధి దానిని.

... ...

వొంటెకు సంవత్సరానికి ఒక్కసారి మదపిచ్చ ఎత్తుతుంది. ఆసమయంలో దానిని యింకో ఒంటెతో సంధానం చేయకపోతే దానికి మతిపోతుంది. సంయోగం కలిగితే

మళ్ళీ కొంతకాలంవరకూ పనికి వెనుతీయదు.

... ...

ఒంటెజీవితపరిమాణం సుమారు 50 సంవత్సరాలు. కాని ఎడారులలో తిరుగుటలో సగటున ఒక ఒంటె 15 లేక 25 సంవత్సరాలుజీవించడం అరుదైపోయింది.

ఆ 25 ఏండ్ల జీవితంలోను ఒక్కొక ఆడఒంటె పది పండ్రెండు ఈతలు యీనుతుంది.

ఒంటెకు పది, పండ్రెండు ఏండ్లలో నేయుక్తవయస్సు వచ్చేస్తుంది-

... ...

దాని ప్రతి అవయవము ఎడారి జీవితమునకు అనువగునట్లు నిర్మించాడు ఆవిధాత. దాని శరీరవర్ణం బూడిదరంగుగా వుంటుంది. అంటే యిసుకరంగుకు సమీపంలో వుంటుందన్నమాట. కాగా శీతాకాలంలో సింహాలు ఒకవేళ ఎడారిమీదకు ప్రాకినా వాటిదృష్టికి ఒంటెలు అందకుండా వుండటానికగాను ఇట్టిరంగు కల్పించాడు ఆ బ్రహ్మ.

... ...

పెద్ద, విశాలమైన ఒంటె డెక్కలు దాని ఉన్నతకాయముయొక్క బరువును సరిగా నిలపడానికి నిర్మింపబడ్డాయి.

ఒంటెదండులు పోయిన బాటవెంట నేను సైకిలుకూడా త్రొక్కడానికి వీలౌతుంది. అంటే అంతగట్టిగా అవి అయిసుకను అణిచివేయగలుగుతా యన్నమాట.

... ...

విశాలమైన ఎడారిలో సూక్ష్మగ్రాహిగా వుండటం అత్యావసరం కాదు. కాబట్టే దానిచెవులు చిన్నవిగా ఉంటాయి. చూపు, వాసన అత్యావసరం. కనుకనే దానికి పెద్ద కండ్లు, పెద్దముక్కు ప్రసాదించాడు సృష్టికర్త.

... ...

తన ముక్కుకోణాలను పరిపూర్ణంగా విప్పి ఆఘ్రాణించిందంటే మైళ్ళదూరంలో ఉన్న నీటినికూడా అది పసికట్టేస్తుంది.

ముక్కుకోణాలను ఫికసింపజేయడమేకాకుండా అది వానిని కుంచించుకొని దగ్గరగాఅదిమి దుమారం రేగినట్లయితే ఒక యిసుకరేణువుకూడా లోన జొరకుండా చేసికొనగలదు.

... ...

నేను ప్రపంచంలో సుమారు 30 లక్షల ఒంటెలు ఉన్నట్టు లెక్కలవల్ల తేలుతున్నది. ఎన్ని విమానాలు వచ్చినా, కార్లు వచ్చినా వాటి ఉపయోగం ఏవిధంగాను తగ్గలేదు. దానికి కారణం వాటి దేహస్థితే.

తేలు కుడితే

పాదలమీదవుంటే కాకిదొండాకు తెచ్చి పసరుపిండికాని, ఉత్తరేణుఆకు పసరుకాని, తేనెకాని, పంచదార చిక్కని పానకంకాని బాగా రుద్దితే నయమౌతుంది. లేదా అరటిపండు పిసికి కట్టినా గుణమౌతుంది.

వాటికి నీరు అక్కర లేదని కొందరు ఆపోహపడతారు. ప్రతీ జీవికి నీరు ఎంత ముఖ్యమో యీ ఒంటెలకూ అంత అవసరమే. కాని విశేషం ఏమంటే దీనిగర్భకోశంలో నీరు దాచుకొనుటకు ప్రత్యేకమైన సంచులు ఉన్నాయి. కాగా ఏదేనా దూరప్రయాణం ఉందనగానే ఒంటె కడుపునిండా నీరుత్రాగుతుంది. ఆనీటితో ఆ సంచులు నిండుతాయి- నిండగానే మూసుకుపోతాయి మూతులు-

మోటారు యజమాని పెట్రోలుటిన్ను ఒకదాన్ని ప్రత్యేకంగా తీసుకొని పోయినట్లే యీఒంటెలు మంచినీటిని తమ గర్భంలోనే దాచుకుంటాయి- కాగా చాలాదూరం అవి నీరు అక్కరలేకండా ప్రయాణం చేయగలవు.

... ...

ఇంతేకాక ప్రకృతి దాని శరీరంలో ఆహారపదార్థాల్ని దాచుకునేందుకు కూడా తావు కల్పించింది- మూపురంలో ఆరోగ్యకరమైన ఆహారం నిలవచేయబడి వుంటుంది- దానికి ఆకలి వేసినప్పుడు ఆమాంసకండరములు శరీరానికి ఆహారాన్ని ఇస్తాయి-

... ...

ఉన్నతంగా, బలంగా, గట్టిగా వున్న మూపురంకల ఒంటె బలిష్టమైందని చెప్పవచ్చు-

బాగా పెరిగిన ఒంటె సుమారు 15 గాలనుల నీటిని ఒక్కసారిగా త్రాగుతుంది. 5 లేక 6 వందల

పౌనుల బరువు మీద వేసుకుని రోజుకి 30 మైళ్లు సునాయాసంగా ప్రయాణంచేస్తుంది.

ఈ బరువు సుమారు 1300 పౌనులు వరకు వేయవచ్చును- కాని ఒంటెయొక్క గమనవేగం తగ్గిపోతుంది.

అనుభవసూక్తులు

ముఖం, ఇల్లు

తనముఖాన్ని గురించి ఎక్కువ జాగ్రత్తపుచ్చుకునే స్త్రీ తనయింటిని గురించి అంత ఎక్కువ జాగ్రత్త పుచ్చుకోదు.

—*Ben Jonson*

సానుభూతి

ఒకరికష్టాలు ఆ'ఒకరు' చెప్పకుండా మనం తెలుసుకోవడమే సానుభూతి.

ప్రేమ · స్నేహము

ప్రేమ పువ్వువంటిది.
స్నేహము నీడనిచ్చే చెట్టువంటిది.

—*S T Coleridge*

గులాబి

ఏవిషయాన్ని గురించి ఐనా నిరుత్సాహిని అవుతున్నాననే భయం నాకు తోస్తే ఆభయం పోగొట్టుకోడానికి నేను గులాబిపువ్వును చూస్తాను.

—*Samain*

మంచి హృదయము

మంచి హృదయం సూర్యునివంటిది. అది బాగా ప్రకాశిస్తుంది. ఎప్పుడుకాని క్రమాన్ని తప్పదు.

—*Shakespeare*

అరబ్బీజాతివి దౌడుతీసే ఒంటెలు. అవి చాలా వేగంగా పోగలవు.

మెక్కా మెదీనాలకు మధ్యను రెండువందల నలుబదిమైళ్ళ దూరముంది. ఆదూరమును ఒంటెమీద ప్రయాణంచేసి 48 గంటల్లో వెళ్ళివచ్చిన ఉదంతాలు చాలా వున్నాయి.

... ...

అప్పటప్పట అరబ్బీదేశీయులు ఒంటెపాలమీదనే జీవిస్తారు. దాని పేడతో పిడకలుచేసి వంటచెరకుగా వినియోగిస్తారు. అరేబియన్ దేశీయులకు ఒంటెలు సేవకులతో తుల్యమైనవి.

... ...

ఒంటెబొచ్చుతో రగ్గులు, దుప్పట్లు, తాళ్లు, రంగులువేసే బ్రష్‌లు (కుంచెలు), బట్టలు, గుడారములకు పనికివచ్చే పెద్దపెద్ద గుడ్డలు మొదలైనవి అనేకం తయారుచేస్తున్నారు. దీనిమాంసము రుచికరంగా వుంటుంది. చాలామంది తింటారు. దానిచర్మంతో చెప్పులు, నీటితిత్తులు చేస్తారు.

... ...

ఈ అరబ్బీజాతి ఎడారి ఓడలకు తోబుట్టువుజాతి ఒకటి వుంది. అవి సర్వసాధారణంగా ఉత్తర దేశాల్లో కనుపిస్తాయి. అనగా ఏషియా, టిబెట్టు, టర్కీష్థాన్, గోబి, చైనా దేశాల్లో విరివిగా కనుపిస్తాయి. వాటిని బాక్ట్రియన్‌జాతి ఒంటెలు అంటారు- వాటికి రెండు మూపురాలుంటాయి- అవి ఉత్తమజాతి ఒంటెలు. అవి అతి ఉష్ణదేశాలలోను, మిక్కిలి చల్లని ప్రదేశాల్లోను కూడా పనిచేయకలవు- కొండలను సునాయాసంగా ఎక్కగలవు. ఒక మూపురం వున్న ఒంటెలు కొండలు ఎక్కలేవు. కాని అరేబియా ఒంటెలాగ ఈ బేక్ట్రియన్ జాతి ఒంటెలు చురుగ్గా నడవలేవు. బేక్ట్రియన్‌జాతి ఒంటెల అవయవాలు పొట్టివిగాను, బలిష్టంగాను వుంటాయి. కాలిచర్మం మోటుగా వుంటుంది. అందువల్ల రాళ్ళరాపిడి

మీకు తెలుసునా?

అట్లాంటిక్ ఉత్తరణం

ఆట్లాంటిక్ సముద్రాన్ని ఉత్తరించిన మొదటి స్టీమరుపేరు రైజింగ్‌సన్ (ఉదయభానుడు). ఈ ఉత్తరణం 1818 లో జరిగింది.

తిమింగిలం దవడ ఎముక

సామాన్యమైన తిమింగిలము యొక్క దవడ యెముక ఏడు అడుగుల పొడుగు వుంటుంది.

దుప్పి, కంగారో దుముకు

దుప్పి తొమ్మిది అడుగుల ఆరు అంగుళాల ఎత్తు దూకగలదు. కంగారో అనే జంతువు పదకొండు అడుగుల ఎత్తు దూకగలదు.

జంతువుల బొచ్చుకోసం

వాటి బొచ్చుకోసమని యీప్రపంచంలో ఏడాదికి దాదాపు ఏడుకోట్ల అడవిజంతువులు చంపబడుతున్నాయి.

గాని, మంచు బాధగాని దానికుండదు. అవి నీటిలో కొంతవరకు ఈదగలవు- ఆపని అరేబియా వొంటెలు చేయలేవు. ఈజాతి వొంటెలు నీరు లేకుండా యితరజాతివొంటెలకన్న దూరప్రయాణం చేయగలవు.

.. . ..

హిందూదేశంలో పలు ప్రాంతాలలో వొంటెల సంతలు జరుగుతాయి. వాటిలో ముఖ్యమైనవి. ఆగ్రా పట్టణానికి సమీపంగా వున్న భటేసా వొకటి. ఝాంగ్‌పూర్ సంస్థానంలోని టిల్‌వర రెండోది. మూడవది: పుష్కర్ సరస్సు సమీపమున రాజపుటానాలోనిది. ఈసంతలలో కొద్దిరోజులలోనే 10000వొంటెలకు బేరాలు జరుగుతాయి-

.. ..

వొంటె వొకనాడు పెద్దపులికన్నా క్రూరమృగమని అందుచే అల్లా దాని పైపళ్ళు ఊడపెరికేశాడని అందుకే వొంటెలకు ఆవు, మేకలవలె పైపళ్ళు లేకుం- వున్నాయని అరబ్బీల నమ్మకం.

మనగిత్త దూడలకు పండ్లుచూసి వయసు నిర్ణయించినట్లే వొంటెలకుకూడా పండ్లనుబట్టి వయసు నిర్ణయిస్తారు. మొదటి ఏడాది దాటిందంటే పాలపండ్లు వూడి రెండు పళ్లు కొత్తవి వస్తాయి. అల్లాగే ఏడాదికి రెండు చొప్పున కొత్తపండ్లువస్తాయి- అరోఏట దీనికి కొత్తగా కోరలువస్తాయి. వానితో కరచింది అంటే తిరుగులేదు.

Printed at the Andhrabhumi Printing Works, 36 Mukatal Street Vepery P.O, Madras.
Editor & Publisher: Andra Seshagiri Rao. B A.

సు
వ
ర్ణ
సుం
ద
ర
ర
స
ము

ఖరోగముల

లన బాధపడు అన్ని వ

ములవారు వేటూరి,

దరశాస్త్రిగారి సువర్ణసుం

ర రసమును వాడిన, శరీ

మునకు బంగా

మువలె కాంతిగలిగి

వా వ్యాధులన్నియు నిర్మూల

కాగలవని విన్నవించు

మీ విశ్వాసపాత్రులు

7367

ఆర్షరసాయనశాల,

ముక్త్యాల (కృష్ణా.)